

- హాస్టల్ సౌకర్యం లేక విద్యార్థుల వెనుకడుగు
- వివిధ కోర్సుల్లో తగ్గుతున్న ప్రవేశాల సంఖ్య
- జూన్ నాటికి పూర్తి చేస్తామన్న హామీ గాలికి..
- ప్రారంభించిన ఫుడ్‌కోర్టు భవనాన్ని అయినా అందుబాటులోకి తెస్తారా!

కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలో భవనాల నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. నాలుగేళ్ల క్రితం చేపట్టిన వసతి గృహాలు ఇప్పటి వరకు పూర్తికాలేదు. అంచనాల వ్యయం పెంచినా అడుగు ముందుకు పడటంలేదు. జూన్ నాటికి విద్యార్థినుల వసతి గృహం పూర్తి చేస్తామన్న అధికారుల హామీ ఆచరణకు నోచుకోలేదు. ఈ ఏడాది పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభం కావడంతో విద్యార్థులను చేర్చే విషయంలో తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. ఫలితంగా వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాల సంఖ్య తగ్గిపోతోంది.



అసంపూర్తిగా ఇంజనీరింగ్ కళాశాల భవనం

నత్తే నయం

కృష్ణా యూనివర్సిటీలో వసతి గృహాల నిర్మాణం తీరు ఇది

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ 2019 వరకు మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాల భవనాల్లో కొనసాగింది. మచిలీపట్నం మండలం రుద్రవరంలో రూ.87 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసిన నూతన భవనాల్లోకి 2019 జనవరిలో యూనివర్సిటీని మార్చారు. వర్సిటీ ప్రాంగణం 102.50 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇప్పటివరకు ప్రాంగణాన్ని మెరక చేయలేదు. నాలుగేళ్ల క్రితం బాలికలు, బాలుర వసతి గృహాల భవనాల నిర్మాణం ప్రారంభించారు. బాలికల వసతి గృహాన్ని ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని చెప్పినా పనులు సగం కూడా పూర్తికాలేదు. బాలుర వసతి గృహంతోపాటు, ఇంజనీరింగ్ కళాశాల భవనాల నిర్మాణ పనులను పునాదుల దశలోనే నిలిపివేశారు. ఇటీవల వీసీ ఈ భవనాల నిర్మాణాన్ని కూడా ప్రారంభిస్తామని చెప్పారు. గవర్నర్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి వచ్చే ముందు బాలుర వసతిగృహం, ఇంజనీరింగ్ భవనాల నిర్మాణం కోసం వేసిన పునాదులలో ఉన్న ఇనుప చువ్వలకు పట్టిన తుప్పును శుభ్రం చేయించారు. ఆ తర్వాత ఈ భవనాల నిర్మాణ పనుల ఊసే ఎత్తడం లేదు. ఈ రెండు భవనాల నిర్మాణ పనులను ఎప్పుడు ప్రారంభించి ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియస్థితి నెలకొంది. గతంలో పనిచేసిన వీసీ జ్ఞానమణి కేంద్రప్రభుత్వ పెద్దలను ఒప్పించి యూనివర్సిటీకి రూ.20 కోట్ల రూసా నిధులను తెచ్చేందుకు అనుమతులు తీసుకువచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నిధులను అయినా వినియోగించి భవనాల నిర్మాణం పూర్తిచేసే దిశగా యూనివర్సిటీ అధికారులు ప్రయత్నాలు చేయాలని ప్రొఫెసర్‌లు కోరుతున్నారు.

అంచనాలు పెంచినా.. పూర్తవ్వని పనులు

యూనివర్సిటీ ప్రాంగణం చుట్టూ ప్రహరీ, మెయిన్ గేట్, ఫార్మసీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, ఫుడ్‌కోర్టు, నూజివీడు పీజీ సెంటరులో బాలికల వసతిగృహం భవనంపై ఫస్ట్‌ఫ్లోర్ నిర్మాణాలకు తొలుత రూ.43.31 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ అంచనాలను తర్వాత రూ.51.19 కోట్లకు పెంచారు. అయినా యూనివర్సిటీ ప్రాంగణంలో ఒక్కఫుడ్‌కోర్టు భవనం నిర్మాణం మాత్రమే పూర్తయింది. ఇటీవల గవర్నర్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి వచ్చిన సమయంలో ఫుడ్‌కోర్టును ప్రారంభించారు. అయినా ఫుడ్‌కోర్టును అందుబాటులోకి తీసుకురాకుండా యూనివర్సిటీ అధికారులు జాప్యం చేస్తున్నారు. మిగిలిన భవనాల నిర్మాణ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

ఈ విద్యా సంవత్సరం తగ్గనున్న విదార్థుల సంఖ్య

యూనివర్సిటీలో వసతి గృహాలు లేకపోవడంతో వివిధ పీజీ కోర్సుల్లో విద్యార్థినీ విద్యార్థులు ఆశించిన స్థాయిలో చేరడంలేదు. గవర్నర్ యూనివర్సిటీకి వచ్చే సమయంలో బాలుర వసతి గృహం, ఇంజనీరింగ్ భవనాల నిర్మాణ పనులను ప్రారంభించే విషయంపై నిర్ణయం తీసుకుంటామని వీసీ ప్రకటించారు. ఆ తర్వాత ఈ భవనాల నిర్మాణ పనుల ఊసే ఎత్తడం లేదు. యూనివర్సిటీలో హాస్టల్ వసతి లేకపోవడంతో పీజీ, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ముందుకురాని స్థితి నెలకొంది. ప్రస్తుతం వివిధ కోర్సుల్లో అడ్మిషన్‌లు జరుగుతుండగా, ఎంబీఏ విభాగంలో 60 మందికి గాను 30 మంది, ఎంసీఏ విభాగంలో 60 మందికి గాను 26 మంది ఇప్పటివరకు రిపోర్టు చేసినట్లు సమాచారం. కాగా, స్నాతకోత్సవ నిర్వహణ తీరుపై జరిగిన సమీక్షా సమావేశంలో గతంలో నాక్ బృందం పర్యటించిన సమయంలో ఫుడ్‌కోర్టు భవనాన్ని వాడుకున్నారని, అదే భవనాన్ని గవర్నర్ చేతుల మీదుగా మళ్లీ ప్రారంభించడంపై ప్రొఫెసర్‌లు, వీసీ మధ్య పెద్దఎత్తున చర్చ జరిగినట్లు తెలిసింది.



- విక్రయించేవారితో పాటు తాగే వారిపైనా కఠిన చర్యలు
- కేసుల ఛేదనలో కీలకంగా సాంకేతిక పరిజ్ఞానం
- సీసీ కెమెరాలకు చిక్కుతున్న నిందితులు
- లోక్ అదాలత్ ద్వారా 4,436 కేసులకు పరిష్కారం
- రాష్ట్రంలో మూడో స్థానంలో జిల్లా
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు

గంజాయిపై ఉక్కుపాదం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

"జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం. విక్రయించే వారిపైనే కాదు.. తాగే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటాం. కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా మారింది. లోక్ అదాలత్ ద్వారా 4,346 కేసులను పరిష్కరించాం. రాష్ట్రంలోనే జిల్లాను మూడో స్థానంలో నిలబెట్టాం" అని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం క్రైమ్: జిల్లాలో గంజాయి అమ్మకాలు, కొనుగోళ్లపై నిఘా పెట్టాం. అమ్మేవారిని గుర్తించి కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నాం. అయినా తీరుమారకుంటే వారి ఆస్తులను జప్తు చేసేందుకు కూడా వెనకాడబోం. ముఖ్యంగా వీరికి గంజాయి ఎక్కడ నుంచి వస్తుందన్న వివరాలు సేకరిస్తున్నాం. తెచ్చే వారిని కూడా అరెస్టు చేసి గంజాయి రహిత జిల్లాగా మార్చుతాం. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. చెడు అలవాట్ల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మత్తుకు బానిస అయిన వారిని రిహాబిలిటేషన్ సెంటర్ల ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చు. ఏడాదిలో 3,737కిలోల గంజాయి, 4.22 కిలోల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశాం. అక్రమ మద్యం 15,280 బాటిళ్లు, 684 లీటర్ల సారాను మిగతా 6లో..



పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద నీటి ప్రవాహం

నిరంతర పర్యవేక్షణ

- బ్యారేజీ నుంచి దిగువకు భారీగా వరద
- పోలీస్, రెవెన్యూశాఖలు సమన్వయంతో పనిచేయాలి
- ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

మచిలీపట్నం/అవనిగడ్డ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ నుంచి వరద నీరు భారీగా వస్తోందని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. నదీ తీర ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. గురువారం ఆమె మచిలీపట్నంలో మాట్లాడుతూ సాయంత్రం నాలుగు గంటల సమయానికి బ్యారేజీ నుంచి 2.60 లక్షల 875 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని చెప్పారు. కెఈ మెయిన్ కెనాల్‌కు 10,187 క్యూసెక్కులు, కేడబ్ల్యూ మెయిన్ కెనాల్‌కు 6,522 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని వదిలినట్టు తెలిపారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 12 అడుగుల మేర ఉందన్నారు. 15 గేట్లు ఏడు అడుగుల మేర, 55 గేట్లు ఆరు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారన్నారు. వరద ప్రభావిత నదీతీర గ్రామాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జలవనరుల శాఖ అధికారులు కాలువల వద్ద నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పరిస్థితిని సమీక్షించాలని సూచించారు.

బిక్కుబిక్కుమంటున్న నదీతీర ప్రాంత ప్రజలు

ప్రకాశం బ్యారేజీ నుంచి భారీగా వరద దిగువకు రావడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని నదీ తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గురువారం పులిగడ్డ ఆక్విడెక్ట్‌కు సమాంతరంగా వరదనీటి ప్రవాహం కొనసాగింది. సర్ ప్లస్ చానల్ ద్వారా కూడా వరద నీరు వదిలేశారు. వరద దృష్ట్యా పులిగడ్డ పడవల రేవు వద్ద ఎక్కడ పడవలు అక్కడే నిలిచిపోయాయి. వేటాడే అవకాశం లేకపోవటంతో మత్స్యకారులు లంగర్లు వేసి తమ పడవలను ఒడ్డున నిలుపుదల చేశారు. పులిగడ్డ ఫెర్రీ వద్ద వరద నీటి ప్రవాహం కనిపిస్తోంది. దివి గ్రామమైన పాత ఎడ్లంక గ్రామానికి ఇప్పటి వరకు కాజ్ వే పదిలంగానే ఉంది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత వరద నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు పేర్కొనడంతో ఈ ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉన్నారు.

గుడివాడ-కంకిపాడు గ్రీన్‌ఫీల్డ్ రయ్ రయ్!

- రూ.600 కోట్ల వ్యయంతో 27 కిలోమీటర్ల మేర నాలుగు వరసల పనులు
- సూత్రప్రాయంగా ప్రాజెక్టుకు క్లియరెన్స్ ఇచ్చిన కేంద్ర మంత్రి గడ్కరీ
- మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ ఆరు వరసల పోర్టు రోడ్డుకూ పచ్చ జెండా
- రూ.350 కోట్లు మంజూరు.. అతి త్వరలో పనులకు శ్రీకారం
- గుడివాడ పట్టణ పరిధిలో పలు రోడ్లకు ప్రతిపాదనలు

కంకిపాడు - గుడివాడ మార్గాన్ని నాలుగు వరసల గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా విస్తరించేందుకు అడుగులు పడ్డాయి. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ప్రతిపాదనలపై కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. గుంతలు, గోతులతో ఎందరో ప్రాణాలను బలితీసుకుంటున్న ఈ రోడ్డును నాలుగు వరసలుగా విస్తరించేందుకు నిధులు విడుదల చేయాల్సిందిగా ఎంపీ బాలశౌరి చేసిన విజ్ఞప్తికి ఆయన సూత్రప్రాయంగా అంగీకారం తెలపటంతో అతి త్వరలో ఈ రోడ్డు పనులు పట్టాలెక్కబోతున్నాయి.



కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి ప్రతిపాదనలిస్తున్న మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /గుడివాడ): ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని గురువారం ఎంపీ బాలశౌరి కలిశారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పలు రోడ్డు ప్రాజెక్టుల అంశాలకు సంబంధించి ఆయనకు ప్రతిపాదించారు. వీటిలో అత్యంత ప్రధానమైనది కంకిపాడు - గుడివాడ రోడ్డు. కంకిపాడు నుంచి గుడివాడ వరకు 27 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు చేపట్టనున్నారు. గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు కావటంతో ముందుగా నాలుగు వరసల రోడ్డు పనులు చేపడతారు. ఆ తర్వాత ఆరు వరసలుగా విస్తరిస్తారు. ఈ ప్రాజెక్టు పీఎం గతిశక్తి కింద నిధులు విడుదల చేయాల్సిందిగా ఎంపీ బాలశౌరి గడ్కరీని అభ్యర్థించారు. ఈ రోడ్డు వల్ల విజయవాడ నుంచి గుడివాడకు గణనీయంగా దూరం తగ్గిపోతుంది. కంకిపాడు - గుడివాడ రోడ్డు ఎన్‌హెచ్ - 165, ఎన్‌హెచ్ - 216 హెచ్, ఎన్‌హెచ్ - 65లను కలుపుతుంది. ఈ విషయాన్ని ఎంపీ బాలశౌరి ప్రధానంగా గడ్కరీ దృష్టికి తీసుకువచ్చారు. ఇలా మూడు జాతీయ రహదారులను కలపటం వల్ల సమీప నగరం విజయవాడకు కుడా అతి తక్కువ సమయంలో చేరుకునే అవకాశం ఉందని వివరించారు.

నాలుగు నియోజకవర్గాల పరిధిలో రోడ్డు..

కంకిపాడు - గుడివాడ రోడ్డు వెంబడే సాగునీటి కాలువ ఉండటంతో కుంగుదల వచ్చి రోడ్డు తీవ్రంగా దెబ్బతింటోంది. గుడివాడ - కంకిపాడు రహదారి దాదాపుగా ఛిద్రమైంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. గుడివాడ, పామర్రు, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల మీదుగా 27 కిలోమీటర్ల పైబడి ఈ రహదారి ఉంటుంది. గుడివాడ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ఉభయగోదావరి జిల్లాల నుంచి విజయవాడకు ఈ రహదారి మీదుగానే వెళతారు. దెబ్బతిన్న ఈ రహదారిపై నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరగడం పరిపాటిగా మారింది. తరచూ ప్రమాదాలతో ఈ రహదారి రక్తమోడుతోంది. పెదపారుపూడి మండలం భూషణగుళ్ల నుంచి వెంట్రప్రగడ వరకు, వెంట్రప్రగడ నుంచి నందమూరు వరకు, నందమూరు నుంచి కంకిపాడు వరకు మూడు ప్యాకేజీలుగా ఈ రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు విభజించారు. రెండు, మూడు ప్యాకేజీల పనులు పూర్తయ్యాయి. దీంతో వాహనదారులకు కొంత ఉపశమనం కలిగింది. మొదటి ప్యాకేజీలోని పెదపారుపూడి సెంటర్ నుంచి వానపాముల విశ్వభారతి వైజ్‌వుడ్స్ వరకు రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇటీవలే మిగతా 6లో..

వసూళ్ల ఏటీఎస్‌లు

- అవినీతిమయంగా వాహనాల ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో రెండు కేంద్రాలు.. భారీ వసూళ్లు
- అవినీతి రవాణా ఇన్‌స్పెక్టర్ల ఏజెంట్ కనుసన్నల్లోనే...
- అక్రమ వసూళ్లకు గతంలో పనిచేసే వారితో ఒప్పందం
- వాహనాన్ని బట్టి రేటు నిర్ణయించి డిమాండ్
- కొందరు రవాణా ఇన్‌స్పెక్టర్ల అండదండలతోనే..
- ఫిర్యాదులపై నూతన జేటీసీ దృష్టిసారించాలి



మచిలీపట్నంలోని ఏటీఎస్ కేంద్రం

వాహనాల ఫిటెనెస్ పరీక్షల కోసం కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లు (ఏటీఎస్) అవినీతిమయమయ్యాయి. ప్రైవేట్ నిర్వాహకుల చేతికి అప్పగించిన ఈ కేంద్రాల్లో నూతన విధానం నిన్న మొన్నటి వరకు బాగానే అమలు జరిగినా ప్రస్తుతం మాత్రం దారి తప్పాయి. వాహనాల కేటగిరీ ప్రాతిపదికన లంచాల ధరలను నిర్దేశించి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. నూతన జేటీసీగా నియమితులైన వడ్డీ సుందర్ ఈ ఏటీఎస్ కేంద్రాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఏర్పాటుచేసిన ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ల (ఏటీఎస్)లో కొద్దిరోజులకే వసూళ్ల కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కేంద్రాలను ఏర్పాటుచేసిన తొలినాళ్లలో బాగానే సాగినా.. ఇప్పుడు మాత్రం అవినీతిమయమయ్యాయి. ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏటీఎస్ కేంద్రాలు అనధికార వసూళ్లకు తెరలేపగా, ఉమ్మడి కృష్ణాజిల్లా కేంద్రాలూ అదే దిశగా పయనిస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో నున్నలోనూ, కృష్ణా జిల్లాలో మచిలీపట్నంలోనూ ఈ ఏటీఎస్ కేంద్రాలు ఉన్నాయి. ఇవి ఆర్‌టీవో కార్యాలయాల పరిధిలో కాకుండా జిల్లాకు ఒక కేంద్రం చొప్పున మంజూరు చేయటం వల్ల వాహనదారులకు దూరాభారమవుతోంది. ఈ సమస్యపై వాహనదారులు పెదవి విరుస్తున్న తరుణంలో తాజాగా వాహనదారులు అక్రమ వసూళ్లను ఎదుర్కొంటున్నారు. వాహనాల కేటగిరీని బట్టి రేటు కట్టి మరీ లంచాలు నిర్ణయిస్తున్నారు. అదేమంటే మిగతా 6లో..

వసూళ్లు ఎలా?

వాహనం కేటగిరీని బట్టి అక్రమ వసూళ్లు ఉంటున్నాయి. ఆరు, పది చక్రాల రవాణా వాహనానికి రూ.2 వేలు తప్పనిసరిగా లంచం ఇవ్వాల్సిందే. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఫీజు రూ.1,020 కంటే రెట్టింపు సంఖ్యలో రూ.2 వేలు లంచం రూపంలో సమర్పించుకోవాల్సి వస్తోంది. 12, 14 చక్రాల వాహనాలకు సంబంధించి రూ.2,700, ట్రాలీల నుంచి రూ.3,700, ప్రైవేట్ బస్సుల నుంచి రూ.4 వేలు, ట్రాక్టర్ అండ్ ట్రాలీల నుంచి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు కూడా వసూలు చేస్తున్నారు.



- ఎంపీ బాలశౌరి కార్యాలయంలో అటెండర్ నిర్వాకం
- ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షలు వసూలు
- ఎంపీ కార్యాలయం ఎదుట బాధితుల నిరసన

విజయవాడలోని ఎంపీ వల్లభనేని బాలశౌరి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగాల బాధితులు

సర్కారు కొలువుల పేరుతో టోకరా!

విజయవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన వైద్యకళాశాలలో ఉద్యోగం.. కృష్ణా వర్సిటీలో ఉద్యోగం.. సీపీడీసీఎల్‌లో ఉద్యోగం.. ఇలా ఒక్కొక్కరికి ఒక్కో శాఖలో ఉద్యోగం ఇప్పించడానికి హామీ ఇచ్చాడు. ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షలు వసూలు చేశాడు. వాళ్లందరికీ నకిలీ నియామకపు పత్రాలు ఇచ్చాడు. తర్వాత ముఖం చాటేశాడు. మచిలీపట్న ఎంపీ వల్లభనేని బాలశౌరి కార్యాలయంలో అటెండర్ గోపాల్‌సింగ్ చేసిన ఘనకార్యం ఇది. గుడివాడ, అవనిగడ్డ, నాగాయలంక, మచిలీపట్నం ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాల పేరుతో వల వేశాడు. ఎంపీ కోటాలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షలు వసూలు చేశాడు. కొద్దిరోజుల క్రితం వారికి నియామకపు పత్రాలు ఇచ్చాడు. ఈ పత్రాలతో ఆయా కార్యాలయాలకు వెళ్లిన వారి వద్ద నియామకపత్రాలు నకిలీవని అక్కడి అధికారులు చెప్పారు. దీంతో వాళ్లంతా మచిలీపట్నంలో ఉన్న ఎంపీ కార్యాలయానికి వెళ్లారు. అన్ని విషయాలు విజయవాడలో ఉన్న కార్యాలయానికి వస్తే మాట్లాడతానని చెప్పడంతో డబ్బులు ఇచ్చిన వాళ్లంతా విజయవాడలో ఉన్న ఎంపీ కార్యాలయానికి వచ్చారు. వారికి గోపాల్‌సింగ్ కనిపించలేదు. అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో బాధితులు కొంతసేపు ఇక్కడ నిరసన తెలిపారు. కార్యాలయంలో ఉన్న సిబ్బంది శనివారం వస్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పి పంపేశారు. ఎంపీ కార్యాలయ ఉద్యోగి తమను మోసం చేశాడని పలువురు బాధితులు లబోదిబోమంటున్నారు.

ఆ గట్టు నున్నావా.. నాగన్న!



రైతన్నలూ జర భద్రం

- ఉమ్మడి కృష్ణాలో ముమ్మరంగా వ్యవసాయ పనులు
- పొలం గట్లపై ప్రమాదకర విషసర్పాల సంచారం
- ఏటా పెరుగుతున్న పాముకాటు మరణాలు
- సత్వరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు



(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

జోరుగా వర్షాలు కురుస్తున్నాయి.. కృష్ణానదికి ఎగువ నుంచి వరద నీరు పోటెత్తుతోంది. పట్టిసీమ జలాలు పుష్కలంగా కాలువలకు చేరుతున్నాయి.. సాగుకు నీరు అందుబాటులో ఉండటంతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతు కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో రైతులు, రైతు కూలీలకు విషసర్పాల రూపంలో ప్రమాదం పొంచి ఉంది. పొలం గట్లపై పాములు సంచరిస్తుంటాయి. గతంలో దివిసీమ ప్రాంతంలో పాము కాటుకు గురై పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. విషసర్పాల బారిన పడకుండా రైతులు, రైతు కూలీలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

పాముకాటుకు గురైతే..

పాము కాటుకు గురైతే ముందుగా అది ఏజాతిదో గుర్తించాలి. కరిచినది విష సర్పమో.. కాదో తెలిస్తే బాధితులు కంగారు పడకుండా స్థితిమితంగా ఉండేందుకు వీలుంటుంది. పాము కరిచిన వ్యక్తిలో లక్షణాలు గుర్తించిన తర్వాతే వైద్యం అందిస్తారు. కరిసిన పాము జాతిని తొలుత గుర్తించడం అవసరం.

బాధితులకు ధైర్యం చెప్పాలి..

పాము కాటుకు గురైన వ్యక్తి భయాందోళన చెందకుండా ధైర్యం చెప్పాలి. విషానికి విరుడుగు ఇంజక్షన్లు ఉన్నాయని, వైద్యుని వద్దకు వెళితే ప్రమాదం నుంచి బయట పడతామని ధీమా కల్పించాలి.

విషం శరీర భాగాల్లోకి చేరకుండా చూడాలి

పాము కరిచిన చోట కొద్దిగా పై భాగాన రుమాలుతోగాని, తుండుతోగాని బిగించి కట్టి విషం శరీర భాగాలకు చేరకుండా చూసుకోవాలి. తాడు, ప్లాస్టిక్ వైరుతో గట్టిగా బిగించి కట్టరాదు. అలా చేస్తే రక్త ప్రసరణ పూర్తిగా ఆగిపోయే ప్రమాదం లేకపోలేదు. కట్టులో నుంచి ఒక వేలు దూరేంతగా బిగించి కట్టాలి. రెండు లేక మూడు గాట్లుంటే విష సర్పమని, అనేక గాట్లుంటే సాధారణ సర్పమని గ్రహించాలి.

నోటితో రక్తం పీల్చరాదు


పాము కరిచిన చోట నోటితో రక్తాన్ని పీల్చి ఉమ్మేయటం అంత మంచిదికాదు. పీల్చే వారి నోటిలో గాయాలుంటే అతడికి ప్రమాదం. పాము కరిచిన చోట కొంత భాగం కోసి తీసేయడం చేస్తే గాయం పెద్దది కావచ్చు. పాము కరిచిన వ్యక్తిని నడిపించకుండా వాహనంపై సాధ్యమైనంత త్వరగా దగ్గరలోని వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి. పాము కాటుకు గురైన వ్యక్తికి నోటి ద్వారా ఏవిధమైన ఆహారం పెట్టకూడదు.

ముందుజాగ్రత్త చర్యలు

పాముకాటుకు గురైన వ్యక్తికి ధైర్యం చెబుతూ త్వరగా ఆసుపత్రిలో చేర్పించాలి. ముందుగా సెలైన్ ఎక్కించాలి. ధనుర్వాతం కాకుండా ముందు జాగ్రత్తగా టెట్వాక్ ఇంజక్షన్ ఇవ్వాలి. రోగిని పరిశీలిస్తూ విష ప్రభావం కనిపిస్తే యాంటీ స్నేక్ వెనెమ్ ఇంజక్షన్ చేయాలి. విష లక్షణాలు కనిపించకుంటే 24 గంటల తర్వాత రోగిని ఆసుపత్రి నుంచి పంపేయవచ్చు. పాము కరిచిన చోట చీముపడితే కోత పెట్టి తొలగించాలి. రక్త పింజర విషం వల్ల మూత్ర పిండాలు పనిచేయకపోవడం.. మెదడులో రక్త స్రావమై కోమాలోకి వెళితే నెఫ్రాలజిస్టు అవసరం ఉంటుంది.

నాటువైద్యం శ్రేయస్కరం కాదు

త్రాచుపాము, కట్లపాము, రక్త పింజరలు ఈప్రాంతంలో సంచరించే విష సర్పాలు. వీటి బారిన పడితే యాంటీ స్నేక్ వెనెమ్ ఇవ్వాలి. పాటు కాటుకు గురైన వ్యక్తి నాటు వైద్యంతో సమయం వృథా చేసుకొని ప్రాణాల మీదకు తెచ్చుకునే కంటే వైద్యులను సంప్రదించడమే మేలు.



ఉద్యోగం పేరుతో రూ.6.65 లక్షలు స్వాహా

పెనమలూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పార్టు టైం ఉద్యోగం ఉందని, మొబైల్‌లో కొన్ని గంటలు మాత్రమే పనిచేయాలని మభ్యపెట్టి విడతలవారీగా ఓ మహిళ నుంచి రూ.6.65లక్షలు స్వాహా చేసిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యనమలకుదురు గ్రామానికి చెందిన తనూజ ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. ఆమె ఫోన్‌కు అథేవా సర్వీస్ సంస్థ నుంచి ఏప్రిల్ 10న పార్టుటైం ఉద్యోగం ఉందని సందేశం వచ్చింది. కొన్ని గంటలు మాత్రమే పని చేయాలని, రోజువారీ చెల్లింపులు ఉంటాయని చెప్పడంతో ఆమె వారి టెలిగ్రామ్ గ్రూపులో చేరింది. కొద్ది రోజుల్లో కొంత మొత్తం సంపాదించిన తనూజ విడతల వారీగా వారికి రు.6,65,000 పంపింది. కానీ వారు తిరిగి డబ్బు ఇవ్వకపోగా మరో పదిలక్షలు పంపాలని ఒత్తిడి చేస్తుండటంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైమ్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాబు స్ఫూర్తిగా పాడి రైతుకు చేయూత

- పీ-4లో కృష్ణా మిల్క్ భాగస్వామ్యం
- పాడిరైతులకు పెయ్యి దూడల సెమెన్‌పై రూ. 100 సబ్సిడీ
- 2025-25 తొలి విడతగా రూ. 13 కోట్ల బోనస్
- చైర్మన్ చలసాని ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తిగా పీ-4లో భాగంగా కృష్ణా మిల్క్ యూనియన్ భాగస్వామ్యంతో పాడి రైతులకు పెయ్యి దూడల సెమెన్‌పై రూ. 100 సబ్సిడీ ఇస్తున్నట్టు యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. పాడి రైతులకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి తొలి విడత బోనస్ (ఏప్రిల్ 25 నుంచి జూలై 25 వరకు) సుమారు రూ.13 కోట్లను ఆగస్టులో చెల్లించేందుకు పాలకవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గురువారం చిట్టినగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో చలసాని మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు పీ-4 స్ఫూర్తిగా కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులను ఆదుకునేందుకు అంకితభావంతో పనిచేస్తుందన్నారు. దీనిలో భాగంగా పెయ్యి దూడల సెమెన్ డోస్ ధర రూ.150 కాగా, ఉమ్మడి కృష్ణా జిల్లాలో పాడి రైతులకు కేవలం రూ.50కే అందించి, రూ.100 యూనియన్ భరిస్తుందన్నారు. ఇది పీ-4 లక్ష్యాలతో పూర్తిగా అనుసంధానమై ఉంటుందన్నారు. అలాగే పశువుల హాస్టల్స్‌ను అవనిగడ్డ పరిధిలోని పెదకళ్ళేపల్లి గ్రామంలో, నందిగామ పరిధిలోని మునగచెర్ల గ్రామంలో త్వరలో ప్రారంభిస్తునట్టు పేర్కొన్నారు. యూనియన్ పరిధిలోని పాడి రైతులకు తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సంకల్పించామన్నారు. ఈ వైద్య ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా పాడి రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆశ్రం హాస్పటల్ సీఈవో హనుమంతరావు, పిన్నమనేని హాస్పటల్స్ సూపరింటెండెంట్ అనిల్ మాట్లాడుతూ, యూనియన్ పాలకవర్గం కోరిక మేరకు పాడి రైతులకు రాయితీ పై వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు, పాలక వర్గసభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





పదవీ విరమణ సందర్భంగా ఉమాదేవిని సత్కరిస్తున్న యుటీఎఫ్ నేతలు

ఆదర్శనీయురాలు ఉమాదేవి

గన్నవరం, జూలై 31(ఆంధ్రజ్యోతి) : ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఉమాదేవి ఆదర్శనీయురాలని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ అన్నారు. దావాజీగూడెం జడ్పీహైస్కూల్ సోషల్ ఉపాధ్యాయినిగా పని చేస్తున్న లంకె ఉమాదేవి పదవీ విరమణ సభ గురువారం జరిగింది. ఉమాదేవి, రామకృష్ణ దంపతులను యూటీఎఫ్ నాయకులు సత్కరించారు. జి.గోవిందరాజులు, కర్రా వరప్రసాద్, దాసరి శివ ప్రసాద్, కె.మధుసూధనరావు, జ్ఞానానందం, శంకరరావు, కుమార్, శోభన్, సీతారామయ్య, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సుదిమళ్ల రవీంద్ర మృతి టీడీపీకి తీరని లోటు

కంకిపాడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర మృతి పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా అన్నారు. సుదిమళ్ల రవీంద్ర కుటుంబ సభ్యులను గురువారం వారు పరామర్శించారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, పులి శ్రీనివాసరావు, నాయకులు కొండా నాగేశ్వరరావు, బొర్రా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం... తొమ్మిది మంది అరెస్టు

ఉయ్యూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరులో వివిధ ప్రదేశాల్లో సిబ్బందితో దాడిచేసి గంజాయి రవాణా చేస్తున్న, నిలువ ఉంచుకున్న, అమ్మకాలు చేస్తున్న 9మందిని అరెస్టుచేసి రెండున్నర కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ టీవీవీ రామారావు తెలిపారు. పొడిలపు జగదీశ్‌కుమార్, కొలసాని వెంకటసాయి, సానక నరేంద్ర, గుడిమెట్ల ప్రవీణ్‌కుమార్, మిక్కిలి కుమార్ సంజయ్, దున్నాల మనోజ్, మహ్మద్ అహ్మద్ బాషా, ఓరుగంటి గోపయ్యస్వామి, సయ్యద్ మునీర్‌ను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు.

వసూళ్ల ఏటీఎస్‌లు

(5వ పేజీ తరువాయి)

ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అక్రమ వసూళ్ల విషయాలను కొందరు వాహనదారులు రవాణా అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. గతంలో రవాణా శాఖ పరిధిలో వాహనాల ఫిట్‌నెస్‌లను విజయవంతంగా చేయించటానికి మధ్యవర్తులుగా ఎవరైతే పనిచేసేవారో వారే ఏటీఎస్ కేంద్రాల్లో చక్రం తిప్పుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పెద్ద టిప్పర్ల యజమానుల నుంచి అక్రమ వసూళ్లకు గానూ అవినీతి రవాణా ఇన్‌స్పెక్టర్ల సిండికేట్ ఒక వ్యక్తిని నియమించుకుంది. ఈ ప్రైవేట్ కలెక్షన్ మాస్టర్‌పై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. గన్నవరం ఎఫ్‌సీ స్టేషన్‌లో వాహనాలకు రంగులు వేసే కార్మికుడి దగ్గర సహాయకుడిగా వచ్చిన వ్యక్తి ఇప్పుడు ఉమ్మడి కృష్ణా జిల్లాలో అవినీతి రవాణా ఇన్‌స్పెక్టర్ల సిండికేట్‌కు వసూళ్ల మాస్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ వ్యక్తే ఇప్పుడు ఉమ్మడి జిల్లాలోని ఏటీఎస్‌లలో చక్రం తిప్పుతున్నాడు. మరో ముగ్గురు మధ్యవర్తులను నియమించుకుని వసూళ్లు చేస్తున్నాడు.

సమస్యలున్న వాటినుంచే అక్రమ వసూళ్లు

అన్ని వాహనాల నుంచి అక్రమ వసూళ్లు చేయట్లేదు. సమస్యలున్న వాటి విషయంలోనే వసూళ్లకు పాల్పడుతున్నారు. వాహనాలకు నల్లటి పొగ వస్తే ఇంజన్ సమస్య ఉన్నట్టుగా భావించాల్సి ఉంటుంది. ఈ నల్లటి పొగ సమస్యను ఏటీఎస్ కేంద్రాల్లోనే సరిచేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. దీనికోసం లంచాలు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ డబ్బు ఇవ్వకపోతే పలు కారణాలు చూపి ఫిట్‌నెస్‌లు చేయకుండా కాలాతీతం చేస్తున్నారు. అదేమంటే.. చాలా వాహనాలకు ఫిట్‌నెస్ చేయాల్సి ఉందని తప్పించుకుంటున్నారు.

దుర్గమ్మకు బంగారు సూత్రాలు కానుక



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగి

ఇంద్రకీలాద్రి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన దాసరి సాయి ప్రియాంక తల్లిదండ్రులు దాసరి భారత నరేంద్ర సింహ, రాజేశ్వరి పేరున రూ.1,68,210లు విలువ చేసే గ్రా.16.5మిల్లీ గ్రాముల బంగారు సూత్రాలను గురువారం ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారికి అమ్మవారి దర్శనం కల్పించగా.. వేద పండితులు వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

వేద విద్యార్థుల సేవలు సమాజానికి అందాలి

ఇంద్రకీలాద్రి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వేద విద్యార్థుల సేవలు సమాజానికి అందేలా అన్నిచర్యలు తీసుకుంటామని దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్ అన్నారు. పోరంకిలోని దుర్గామల్లేశ్వర వేద విద్యాలయం (వేద పాఠశాల)ను గురువారం ఈవో తనిఖీ చేశారు. వేద పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధనపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఈవో మాట్లాడారు. విద్యార్థులకు పుస్తకాలు, సౌకర్యాలను తక్షణమే ఏర్పాటు చేయవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు. వేద విద్యార్థులకు సాధ్యమైనంత ఉత్తమమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. పెండింగ్ పనులను సకాలంలో పూర్తిచేయాలని ఇంజనీరింగ్ విభాగానికి సూచించారు.

అనుమతి లేకుండా వస్తే కఠిన చర్యలు

- ముగ్గురు సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్‌పై వేటు
- ప్రైవేటు సెక్యూరిటీ సంస్థకు రూ.25వేలు జరిమానా

ఇంద్రకీలాద్రి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ప్రాంగణంలోకి అధికారుల అనుమతి లేకుండా ఆహార పదార్థాల ఆటోను అనుమతించినందుకు అయా ప్రదేశాల్లో విధుల్లో ఉన్న ముగ్గురు ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్‌ను ఈవో వీకే శీనానాయక్ విధుల నుంచి సస్పెండ్ చేశారు. సెక్యూరిటీ సంస్థకు రూ.25వేల జరిమానా విధించారు. కనకదుర్గానగర్ ప్రధాన మార్గం నుంచి ఆటోలో ఐదుగురు వ్యక్తులు పలు ఆహార పదార్థాలను కొండపైకి తీసుకువెళ్లేందుకు మహామండపం లిఫ్ట్ వద్దకు వెళ్లారు. అదే సమయంలో వచ్చిన ఈవో లిఫ్టుల సమీపంలో ఆటో ఉండటం గమనించి అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల అనుమతి లేకుండా ఆహార పదార్థాలు ఉన్న ఆటోను ఎందుకు అనుమతించారని సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్‌ను ప్రశ్నించారు. ఆటోను అనుమతించినందుకు కనకదుర్గానగర్ ప్రధాన గేట్, చైనా వాల్, గోశాల వద్ద విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బందితో పాటు సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేశారు. ప్రైవేటు సెక్యూరిటీ సంస్థ పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ రూ.25వేలు జరిమానా విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఈవో హెచ్చరించారు.

శాఖల సమన్వయంతో మెరుగైన సేవలు

మచిలీపట్నం క్రైమ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు పోలీస్‌శాఖ, బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని వివిధ బ్యాంకుల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్బీఐ సూచనల మేరకు ప్రతి బ్యాంకు, ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రాత్రి వేళల్లో ఏటీఎం ప్రాంగణాల్లో వెలుతురు ఉండేలా చూడాలని, ప్రైవేట్ సెక్యురిటీ గార్డుల నియామకం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర అలారం, లింకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఏటీఎంల వద్ద అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల గురించి సమాచారం అందించాలన్నారు. ప్రజల ఆస్తి, ధనం సురక్షితంగా ఉండేందుకు శాఖల మధ్య సమన్వయం అవసరమన్నారు. అడిషనల్ ఎస్పీ వి.వి నాయుడు, డీఎస్పీలు సీహెచ్ రాజ, శ్రీనివాసరావు, ధీరజ్ వినీల్, విద్యశ్రీ, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సర్కార్ సర్వీసుల్లో మార్పు

రైల్వేస్టేషన్ : చెంగల్‌పట్టు-కాకినాడ పోర్టు సర్కార్ ఎక్స్‌ప్రెస్ (17643-17644), కాకినాడ పోర్టు-పాండిచ్చేరి సర్కార్ ఎక్స్‌ప్రెస్ (17655-17656) సర్వీసుల్లో మార్పులు చేసినట్టు విజయవాడ డివిజన్ రైల్వే పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17643 రైలు మంగళ, బుధ, శని, ఆదివారాల్లో.. అలాగే 17644 సోమ, మంగళ, శుక్ర, శనివారాల్లో అక్టోబరు 3వ తేదీ వరకు నడుస్తాయని తెలిపారు. 17655 సర్కార్ ఎక్స్‌ప్రెస్ బుధ, గురు, ఆదివారాలు అక్టోబరు 4వ తేదీ వరకు.. అలాగే 17656 సోమ, గురు, శుక్రవారాలు అక్టోబరు 2వ తేదీ వరకు నడుస్తాయని తెలిపారు. వేళల్లో ఎటువంటి మార్పులు ఉండవని ఆమె పేర్కొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

ధ్వంసం చేశాం.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాం. గత నవంబర్‌లో ఆరు శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశాం. 28 మంది శిక్షణ పొందిన మహిళా సిబ్బందిని మోటార్ సైకిళ్లపై పహారాకు నియమించాం. కాలేజీలు, మార్కెట్లు, బస్‌స్టేషన్లు హాట్‌స్పాట్‌లుగా గుర్తించి ఈవ్‌టీజింగ్‌ను అరికట్టగలిగాం. గృహహింస, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్ వంటి కేసుల్లో తక్షణ చర్యలు తీసుకోవటం ద్వారా నేరం జరిగే తీవ్రతను తగ్గించగలిగాం. వేగంగా స్పందించటంతో మహిళల్లో భద్రతా భావనను పెంపొందించాం. జిల్లాలో శక్తి యాప్‌ను 5.32 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం.

సాంకేతికతతో కేసుల ఛేదన

కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోంది. పెనమలూరు డబుల్ మర్డర్ కేసులో టవర్ డంప్ సీసీటీవీ ఆధారాలతో నిందితులను అరెస్టు చేయగలిగాం. చల్లపలి హత్య కేసులో పొటాషియం సైనైడ్ వాడిన నిందితులను సాంకేతిక ఆధారాలతో పట్టుకున్నాం. సీసీ కెమెరాల ద్వారా బైక్ దొంగలను పట్టుకుని 70 లక్షల విలువైన 90 వాహనాలను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించాం.

పటిష్ట నిఘా

జిల్లా వ్యాప్తంగా 4,040 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రజా ప్రదేశాల్లో 2,550, ఆలయాల్లో 407, చర్చిల్లో 247, మసీదుల్లో 74 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత నిఘా మరింత సులభతరం అయ్యింది. పబ్లిక్ మీటింగ్, వీఐపీ పర్యటనలు, పండగలు, అత్యవసర పరిస్థితుల్లో డ్రోన్‌లను వినియోగిస్తున్నాం. ఎన్‌ఏటీ గిడ్ ద్వారా 123 కేసులను వేగవంతంగా ఛేదించగలిగాం. చోరీకి గురైన 702 మొబైల్ ఫోన్‌లను ఎంఎంటీఎస్ సహాయంతో స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించాం.

కీలకమైన కేసుల్లో శిక్షలు పడేలా కృషి

2024-25లో వివిధ నేరాలకు సంబంధించి 220 తీర్పులు వచ్చాయి. హత్యలు, పోక్సో కేసులకు సంబంధించి సమగ్ర ఆధారాలను సమర్పించటంతో చాలామందికి కోర్టులు జీవిత ఖైదు విధించాయి. కొంత మందికి 20 ఏళ్ల పైబడి శిక్షలు పడ్డాయి. కోర్టు మానిటరింగ్ సిస్టం పటిష్ట పరచటం ద్వారా నేరాలను చేసిన వారికి శిక్షలు త్వరితగతిన వేయించగలిగాం. లోక్ అదాలత్ ద్వారా 4,436 కేసులు పరిష్కరించి రాష్ట్రంలో మూడో స్థానంలో జిల్లాని నిలబెట్టాం.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. 244 మంది బదిలీల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాం. వారి వ్యక్తిగత సమస్యల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరిస్తున్నాం. వార్షిక క్రీడలు, ఆరోగ్య కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది తాలూకు రావలసిన ఎరియర్స్ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నాం. కారుణ్య నియామకాల విషయంలో త్వరిత గతిన స్పందించటం ద్వారా వారికి న్యాయం చేస్తున్నాం. రిటైర్ అయిన సిబ్బందికి అందవలసిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

రయ్ రయ్!

(5వ పేజీ తరువాయి)

కలవపాముల - వెంట్రప్రగడ మధ్య జరిగిన రహదారి ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య షాక్‌కు గురైంది. దాదాపుగా 3.6 కిలోమీటర్ల మేర రహదారిని అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రమాదాల నిలయంగా మారిన ఈ రహదారి పరిస్థితి గురించి బాలశౌరి, గడ్కరీకి సమగ్రంగా వివరించారు. దీంతో గడ్కరీ సానుకూలంగా స్పందించటంతో పాటు అప్పటికప్పుడు క్లియరెన్స్ ఇచ్చారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుకు భూ సేకరణతో కలిపి దాదాపుగా రూ.600 కోట్ల వ్యయం కానుంది. నిర్మాణ ఖర్చు రూ.300 కోట్లు పైబడి అయ్యేఅవకాశం ఉంది. ఈ నిధులను అతి త్వరలో విడుదల చేసే అవకాశం ఉంది.

మచిలీపట్నం పోర్టు రోడ్డుకు రూ.350 కోట్లు మంజూరు

మచిలీపట్నం సౌత్ పోర్టు నుంచి ఎన్‌హెచ్ - 65 వరకు ఆరు వరసలు 18.5 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు రూ.350 కోట్లను మంజూరు చేస్తున్నట్టు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మచిలీపట్నం సౌత్ పోర్టు నుంచి రైస్ మిల్ వరకు వస్తూ ఎన్‌హెచ్ - 65ను అనుసంధానిస్తుంది. ఈ రోడ్డు వల్ల మచిలీపట్నం పోర్టు నుంచి సరకు రవాణాకు దోహదపడుతుంది. ఈ ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలను బలోపేతం చేస్తుంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో భాగంగా మొత్తం ఏడు అండర్ పాస్‌లు, మూడు ఫ్లైఓవర్ల నిర్మాణం జరుగుతుంది. బీచ్ రోడ్‌లో కూడా ఒక ఫ్లై ఓవర్‌ను నిర్మిస్తారు.

నాలుగు లేన్లుగా మంగినపూడి బీచ్ రోడ్డు

మంగినపూడి బీచ్ రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా అప్‌గ్రేడ్ చేయటానికి గడ్కరీ అంగీకరించారు. మొత్తం 11.7 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న మంగినపూడి బీచ్ రోడ్డు తీరప్రాంతం, మచిలీపట్నం పట్టణం మధ్య కీలకమైన లింక్‌గా పనిచేస్తుంది. ఈ రోడ్డును నాలుగు లేన్లుగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల రవాణా మెరుగుపడుతుంది, పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది. స్థానిక ఆర్థికాభివృద్ధికి ఊతం ఇస్తుంది.

కేంద్ర మంత్రి దృష్టికి గుడివాడ పట్టణ రహదారులు

గుడివాడ పట్టణ పరిధిలో జాతీయ రహదారి 216 హెచ్‌పై తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వార్షిక ప్రణాళిక కింద రూ.18.50 కోట్ల నిధుల కోసం ఎంపీ బాలశౌరి కేంద్ర మంత్రి గడ్కరీకి నివేదించారు. గుడివాడ పట్టణం నుంచి ఎన్‌హెచ్ - 216హెచ్ వరకు అనుసంధానంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని మరో ప్రతిపాదన అందించారు. గుడివాడ పట్టణంలో ఫ్లై ఓవర్‌కు అనుసంధానంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గుడివాడ పట్టణ పరిధిలో ఎన్‌హెచ్ - 165, ఎన్‌హెచ్ - 216హెచ్‌ల మధ్య అనుసంధాన ప్రాంతంలో గ్యాప్‌లు ఉన్న చోట్ల విస్తరణ పనులకు రూ. 28.50 కోట్ల మేర రూపొందించిన డీపీఆర్‌ను గడ్కరీకి అందించటం జరిగింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

జడ్పీ హైస్కూల్‌కు రూ.2 లక్షల విలువైన ఫర్నిచర్ అందజేత



ఉయ్యూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.2లక్షల విలువైన ఫర్నిచర్‌ను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా హడ్కో రీజినల్ చీఫ్ టీవీ ఎస్ మూర్తి గురువారం అందజేశారు. విద్యార్థులు కూర్చునేందుకు 50 డెస్క్‌లు, 20 క్లాస్‌రూమ్ టేబుళ్లు, 40 కుర్చీలు, 20 ఫ్యాన్లు, 25 ట్యూబ్‌లైట్లు అందజేశారు. జనరల్ మేనేజర్లు కె.విజయ్‌కుమార్, టి.శ్రీనివాసబాబు, ప్రధానోపాధ్యాయుడు టీవీ నాగేశరరావు, యూటీఎఫ్ నాయకుడు పీవీ రమణ పాల్గొన్నారు.

పారదర్శకంగా పీ-4 లబ్ధిదారుల ఎంపిక

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి) : పీ-4 లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని ఎంపీడీవో త్రినాథ్ సూచించారు. వేలేరు పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మురళీకృష్ణతో కలిసి ఆయన పాల్గొన్నారు. సహకారం అందించేందుకు ముందుకువస్తున్న దాతలతో సహా లబ్ధిదారులను గ్రామసభ ద్వారా ఎంపిక చేయాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ అవిర్నేని భవానీ శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. బిళ్లనపల్లిలో పీ-4 లబ్ధిదారులకు ఎంపికపై ఎంపీడీవో త్రినాథ్ సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు చంద్రబాబు కృషి

హనుమాన్‌జంక్షన్ : పేదరిక నిర్మూలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, పీ-4 సర్వేలో అర్హులైన పేదలను గుర్తించి వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని మాల ఫైనాన్స్ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు అన్నారు. గురువారం బాపులపాడు పంచాయతీ కార్యాలయంలో పీ-4 అర్హుల జాబితాపై ఇన్‌చార్జి ఎంపీడీవో త్రినాథరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో సర్వేలో గుర్తించిన 800 మందిలో నిజమైన పేదల ఎంపికపై సమీక్ష జరిపారు. ఉపసర్పంచ్ దుట్టా శివన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల విజేతలకు అభినందన



హనుమాన్‌జంక్షన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటూరు జిల్లా రేవేంద్రపాడులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలను గురువారం వీహెచ్‌పీ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ అభినందించారు. పీవై గోల్డు జిమ్ కోచ్ బి.ప్రసన్నకుమార్ 4 బంగారు పతకాలు, 2 వెండి పతకాలు, ఫిట్‌నెస్ కోచ్ దొరబాబు 4 బంగారు పతకాలు, మురళీకృష్ణ 3 బంగారు పతకాలు సాధించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో బంగారు పతకాలు సాధించిన ఎన్.లీల శివఅజిత్, ఓలేటి లిఖిత, సాయిశ్రీని పుట్టగుంట అభినందించారు. డాక్టర్ కోటే అశోక్‌కుమార్, లయన్స్ క్లబ్ నేతలు నందిగం స్వామి, తాడి రంగారావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఉంగుటూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఆత్కూరు సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ అన్నారు. గ్రామ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలను గురువారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, హెల్త్ విజిటర్ ఎండీ అలీమాబీ, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశావర్కర్లు, పంచాయతీసిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్

కంకిపాడు, జూలై 31(ఆంధ్రజ్యోతి): కందలంపాడు ఎంపీపీ స్కూల్‌కు వెలగపూడి శశి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెలగపూడి వెంకటరమణ వాటర్ ప్యూరిఫయర్‌ను గురువారం అందజేశారు. టీడీపీ కందలంపాడు గ్రామ అధ్యక్షుడు మొవ్వ నరేష్, హెచ్‌ఎం శైలజ, టీడీపీ నాయకులు మొవ్వ కొండ పాల్గొన్నారు.

భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ఉయ్యూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్ సూచించారు. కాటూరు, కలవపాములలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన భూయజమానుల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి, కార్యదర్శి సుబ్బారావు, రైతులు ఆళ్ల శ్రీకాంత్, కొలుసు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌వోఎస్ పదవి రద్దు

● ఆసక్తి ఉన్న స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తులు చేసుకోవచ్చు
● జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు

విజయవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం ఉన్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ (ఎస్‌జీఎఫ్ఓఎస్) పదవిని రద్దు చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే రెండేళ్లకు (2025-26, 2026-27) అండర్-14, 17 విభాగాల్లో ఆర్గనైజింగ్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. జిల్లా ప్రభుత్వ పాఠశాల, జిల్లాపరిషత్, మున్సిపల్ యాజమాన్యంలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)/పీఈటీలు ఆగస్టు 3లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2 నెలల్లో ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందబోయేవారు, గతంలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా పనిచేసినవారు అనర్హులన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో సంబంధిత అధికారి నుంచి క్రమశిక్షణా చర్యలు ఎదుర్కొన్నవారు కూడా అనర్హులని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి అనుమతితో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలన్నారు.

ఉద్యోగాల పేరుతో టోకరా

● వైసీపీ నేతపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వైసీపీ నేతపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. అల్లంకి గంగాధర్ తోటవారి వీధిలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. గత ఏడాది వైసీపీకి చెందిన బండారు శ్రీకాంత్‌తో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో తనకు మంత్రులతో పరిచయాలున్నాయని మైనింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలిప్పిస్తానని శ్రీకాంత్ గంగాధర్‌తో నమ్మబలికాడు. ఉద్యోగాలకు గాను రూ.20 లక్షలు ఇవ్వాల్సిందిగా కోరాడు. దీంతో గంగాధర్ విడతలవారీగా శ్రీకాంత్‌కు రూ.20లక్షలు ఇచ్చాడు. డబ్బులిచ్చి ఏడాది అవుతున్నా ఉద్యోగం రాకపోవడం గట్టిగా నిలదీయడంతో శ్రీకాంత్ ముఖం చాటేశాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన గంగాధర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5న 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శి రవీంద్రరాజు

గాంధీనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై ఈనెల 5న వినూత్నంగా నిర్వహించనున్న 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బీహెచ్ రవీంద్రరాజు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో జరిగే ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించుకోవడం జరుగుతుందన్నారు. రావాల్సిన పెండింగ్ బకాయిలు, డీఏ, ఐఆర్, పీఆర్సీ, సరెండర్ లీవ్‌లు తదితర అంశాలపై చర్చించుకుని వాటి సాధనకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. ఉద్యోగులు తమ హక్కులు సాధించుకోవడానికి అందరూ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యల పరిష్కారానికి తమ సంఘం కృషి చేస్తుందన్నారు.



రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వైసీపీ నేతలు

ఆన్‌లైన్ నామినేషన్ విధానాన్ని పరిశీలించండి

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అవినాష్

గుణదల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పటిష్ఠమైన బందోబస్తు మధ్య నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అవకాశమైన ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలని, అలాగే నామినేషన్లు వేయడానికి ఆసక్తి ఉన్న వారికి అధికార పార్టీ నుంచి బెదిరింపులు వచ్చే అవకాశం ఉన్నందున ఆన్‌లైన్లో నామినేషన్ దాఖలు చేసే సదుపాయం ఉంటే పరిశీలించాలని కోరారు. అవినాష్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, జీ శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి పాల్గొన్నారు.



ప్రమాదకరంగా పడవ ప్రయాణం

ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వస్తున్న వరద నీటితో కృష్ణమ్మ ఉరకలేస్తోంది. ఉధృతంగా ప్రవహిస్తూ ముందుకు దూకుతోంది. ప్రమాదకరంగా ఉన్న కృష్ణానదిలో లైఫ్ జాకెట్లు, సరైన భద్రత లేకుండా పరిమితికి మించి జనం పడవలో ప్రయాణం చేస్తున్నారు. ఇందులో మహిళలు కూడా ఉన్నారు. ఈ ప్రయాణంలో జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. కృష్ణాజిల్లా యనమలకుదురు కట్ట వద్ద లంక పొలాల్లోకి నాటు పడవల్లో వెళుతున్న దృశ్యాలివి..

ఆంధ్రజ్యోతి, విజయవాడ



ప్రేమ వ్యవహారంలోకి రాజకీయం!

● నా కుమారుడి పెళ్లితో పేర్ని నాని రాజకీయం: పల్లపాటి ● పేద కాపు మహిళకు న్యాయం చేయండి: కాపు నేత కొట్టె

మచిలీపట్నం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, టీడీపీ నేత పల్లపాటి సుబ్రహ్మణ్యం కుమారుడు పల్లపాటి అభినవ్ ప్రేమ వ్యవహారం రాజకీయ వివాదంగా మారింది. అభినవ్, ప్రేమించిన యువతి జాహ్నవి మేజర్లు కావడంతో పూరి వెళ్లారు. దీంతో ఆమె తల్లిదండ్రులు శివపార్వతి, కోటేశ్వరరావు కుమార్తె కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరిగి వచ్చిన తర్వాత అభినవ్-జాహ్నవి వివాహం చేయాలని కోరారు. అనంతరం అభినవ్ వివాహానికి సుముఖత చూపలేదని ఆరోపిస్తూ జాహ్నవి తల్లి శివపార్వతి పోలీస్ స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నం చేసి, ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనను వైసీపీ నేతలు రాజకీయం చేస్తూ ఆసుపత్రికి వెళ్లి శివపార్వతిని పరామర్శించారు పైగా అభినవ్‌పై కేసులు పెట్టించారు. అభినవ్ యాదవ కులానికి, జాహ్నవి కాపు కులానికి చెందిన వారు కావడంతో కుల రాజకీయాలు తెరపైకి వచ్చాయి. కుల సంఘ నేతల జోక్యంతో ప్రెస్‌మీట్లు పెట్టి విమర్శలు చేసుకుంటున్నారు. దీంతో మచిలీపట్నంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పల్లపాటి సుబ్రహ్మణ్యం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన కుమారుడు అభినవ్, జాహ్నవి మధ్య ప్రేమ వ్యవహారాన్ని వైసీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యే పేర్నినాని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తమ కుమారుడిపై వైసీపీ నేతలు లేనిపోని కేసులు పెట్టిస్తూ, యాదవ, కాపు కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పేర్నినాని కుల రాజకీయాలకు తెరతీస్తున్నారని, అభినవ్ నేరం చేస్తే చట్టపరంగా శిక్షించాలన్నారు. జాహ్నవిని తమ ఇంటి కోడలుగా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నా వైసీపీ నేతలు విషయాన్ని వక్రీకరిస్తున్నారని, మంత్రి కొల్లు రవీంద్రను ఈ వివాదంలోకి లాగడం ఆశ్చర్యకరమని అన్నారు. సుబ్రహ్మణ్యం భార్య మీడియా ముందు కన్నీటిపర్యంతమై, వైసీపీ నేతలు జాహ్నవి, ఆమె తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి, శివపార్వతిని ఆసుపత్రిలో పరామర్శించిన అనంతరం, అభినవ్, జాహ్నవి వివాహానికి మంత్రి కొల్లు రవీంద్ర ముందుకు రావాలని డిమాండ్ చేశారు. విజయవాడ, మచిలీపట్నం నగర మేయర్లు రాయన భాగ్యలక్ష్మి, చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైసీపీ నేతలు పేర్ని కిట్టు, మేకల సుబ్బన్న, గాజుల భగవాన్, షేక్ సిలార్‌దాదా, నాగరాజు పాల్గొన్నారు. కాపు యువజన సేన నేత కొట్టె వెంకట్రావు, శాయన శివ తదితరులు శివపార్వతిని పరామర్శించి, అభినవ్‌తో జాహ్నవి వివాహం జరిపించాలని డిమాండ్ చేశారు. జనసేన నేతలు పినిశెట్టి వేణు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పల్లపాటి, శివపార్వతిని పరామర్శిస్తున్న కాపు నేతలు



నూతన ఉద్యోగులకు నియామకపత్రాలు అందిస్తున్న కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం, సీఈవో శ్యామ్‌మనోహర్

కేడీసీసీబీ అభివృద్ధికి కృషి చేయండి

● 62 మందికి నియామకపత్రాలు అందించిన ఛైర్మన్ నెట్టెం

మచిలీపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంకు (కేడీసీసీబీ)లో ఉద్యోగం పొందినవారు బ్యాంకు అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. స్టాఫ్ అసిస్టెంట్‌లుగా ఎంపికైన 62 మందికి నియామకపత్రాలను సీఈవో శ్యామ్‌మనోహర్‌తో కలిసి గురువారం కేడీసీసీబీ ప్రధానకార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేడీసీసీబీలో స్టాఫ్ అసిస్టెంట్లుగా నేరుగా ఎంపికైన 49 మందికి, ఇన్‌సర్వీసులోని 13మందికి ఉద్యోగాలివ్వడం జరిగిందన్నారు. రైతులకు పంటరుణాల్లో వాణిజ్యబ్యాంకులతో కేడీసీసీబీ పోటీపడి 4, 5 స్థానాల్లో నిలుస్తోందన్నారు. రైతులకు సేవచేయాలనే సంకల్పంతో ఉద్యోగంలో చేరినవారు పనిచేయాలన్నారు, ఆగస్టు 18లోగా ఉద్యోగంలో చేరాలని, 18 నుంచి హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

దీర్ఘకాలిక రుణాలకు రూ.1600 కోట్లు

తొలుత కేడీసీసీబీ తొలి 3 నెలల ప్రగతిపై అధికారులతో కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం సమీక్ష నిర్వహించారు. భూమిని వ్యవసాయ ఉత్పత్తులకు అనుగుణంగా మార్చడం, డ్రిప్, మైక్రో ఇరిగేషన్, సెరీ, టిస్యూకల్చర్ ప్రోత్సాహించడానికి రైతులకు, చిన్నపాటి పారిశ్రామిక వేత్తలకు ఒక్కో యూనిట్‌కు రూ.2కోట్ల వరకు రుణాలిచ్చేందుకు అప్కాబ్ అనుమతులు వచ్చాయన్నారు. ఇందుకు కేడీసీసీబీకి రూ.1600 కోట్లను ఆప్కాబ్ కేటాయించిదన్నారు. దీంతోపాటు రూ.9.55 లక్షల విలువైన ఒక్కో డ్రోన్‌స్ప్రేయర్‌ను రైతుగ్రూపులకు 80 శాతం సబ్సిడీతో ఇచ్చేందుకు అనుమతిచ్చిందన్నారు.

రెడ్‌క్రాస్ సేవల్లో పాల్గొనడం అదృష్టం

● ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ

మచిలీపట్నం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున సమాజ సేవలో పాల్గొనడం ఎంతో అదృష్టమని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. గురువారం జిల్లాపరిషత్ సమావేశపు హాలులో ఇండియన్ రెడ్‌క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షురాలు, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమాజసేవే పరమావధిగా పని చేస్తోందన్నారు. సొసైటీ మంచిపనితీరు కనబడేలా కృషి చేయాలన్నారు. సామాజిక సేవల్లో చురుగ్గా పాల్గొనే వారిని గుర్తించి రెగ్యులర్ కలెక్టర్ వచ్చిన తరువాత కమిటీ ఎన్నికలు జరుపుతామన్నారు. ఐఆర్‌సీఎస్ రాష్ట్ర పరిశీలకుడు రామచంద్రరాజు మాట్లాడుతూ స్వచ్ఛందంగా సేవ చేసే వారే సొసైటీలో సభ్యులుగా ఉండాలన్నారు. ఐఆర్‌సీఎస్ కార్యదర్శి బీ శంకర్నాథ్ మూడేళ్లుగా సొసైటీ చేపట్టిన రక్తదాన శిబిరాలు, వైద్యశిబిరాలు తదితర అంశాలను వివరించారు. తొలుత ఐఆర్‌సీఎస్ ఉద్యమ పితామహుడు హెన్రీ డోనాట్ చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ, ఐఆర్‌సీఎస్ రాష్ట్ర పరిశీలకులు రామచంద్రరాజు, జిల్లా ఛైర్మన్ బాలాజీ, కార్యదర్శి శంకర్నాథ్ లను ఘనంగా సత్కరించారు. డీఆర్వో కే చంద్రశేఖరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్ వెంకట్రావు, ఆర్ఐవో సాల్మన్‌రాజు, ఐఆర్‌సీఎస్ సభ్యులు పాల్గొన్నారు.



రెడ్ క్రాస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గీతాంజలి శర్మ

ప్రభుత్వ భూపందేరాలను అడ్డుకుంటాం

● లులూకు ఆర్టీసీ స్థలాలు కేటాయింపు దుర్మార్గం ● రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

గవర్నర్‌పేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజల భూములను, ప్రభుత్వ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తామని, ప్రజా పోరాటాలు, న్యాయ పోరాటం ద్వారా రక్షించుకుంటామని విజయవాడ పౌర వేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు స్పష్టం చేశారు. విజయవాడ పాత బస్టాండ్‌లోని 4.26 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని షాపింగ్ మాల్ నిర్మాణం కోసం లులూ గ్రూప్ కార్పొరేట్ కంపెనీకి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 137ను రద్దు చేయాలని, ఆ స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకే వినియోగించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఈ సమావేశం జరిగింది. ప్రజా సంఘాలు, వ్యాపార సంఘాలు, న్యాయవాదులు, ఆర్టీసీ యూనియన్ నేతలు, చిన్న మధ్య తరగతి వ్యాపార వర్గాల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు కేటాయించడానికి అడ్డుకట్ట వేసేందుకు, ప్రజా ఉద్యమం నిర్మించేందుకు కార్యాచరణ ప్రకటిస్తూ కమిటీని ఏర్పాటు చేశారు. అన్ని వర్గాలను కలుపుకుని ఐక్య ఉద్యమం చేపట్టాలని తీర్మానించారు. టాక్స్ పేయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎంవీ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలకు కేటాయించడానికి అవి హెరిటేజ్ షేర్లు కాదన్నారు. ఆర్టీసీ కార్యకలాపాలు జరిగే ప్రాంతాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం స్వార్థ ప్రయోజనాలను సూచిస్తుందని, లులూ కంపెనీకి దేశంలో ఏ రాష్ట్రంలోనూ ప్రభుత్వ భూమి ఇవ్వలేదని, ఏపీలో మాత్రం ఇవ్వడం ప్రజా వ్యతిరేక చర్యని అన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు భవిష్యత్ అవసరాలకు ఉంచిన ఖాళీ స్థలాలను ప్రస్తుత ప్రభుత్వం తమ అనుకూల వ్యక్తులకు తక్కువ రేట్లకు కట్టబెడుతూ క్విడ్ ప్రో క్వో నిర్వహిస్తోందని ఆరోపించారు. ఐలూ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా అభివృద్ధి ముసుగులో సామాజిక ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయడం బాధాకరమన్నారు. ఆర్టీసీ స్థలాన్ని లులూ సంస్థకు ఇవ్వడాన్ని ప్రజలు సహించరన్నారు. అర్బన్ సిటిజన్ ఫెడరేషన్ కన్వీనర్ సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ ప్రజల ఆస్తులను కాపాడే ఉద్యమం కోసం కార్యాచరణ ప్రకటిస్తామని, ఐక్య ఉద్యమాలతోనే ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఘటిస్తామని అన్నారు. సమావేశంలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నేత దామోదరరావు, జన చైతన్య వేదిక కన్వీనర్ లక్ష్మారెడ్డి, నీటి సంఘాల అధ్యక్షుడు అక్కినేని భవానీప్రసాద్, సీపీఎం నేత దోనేపూడి కాశీనాథ్, హోటల్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ నేత సుందరయ్య, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ నేత కొనగళ్ల విద్యాధరరావు, సీఐటీయూ నేత కే దుర్గారావు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐలూ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్

పారదర్శకంగా పౌర సరఫరాల సేవలు

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత పారదర్శకంగా పౌర సరఫరాల శాఖ ద్వారా సేవలందించడం జరుగుతోందని, ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా నిరాటంకంగా సరుకుల పంపిణీ జరుగుతోందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇగ్నైట్‌సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ప్రతి నెలా 1 నుంచి 15 వరకు రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందుతున్న రైస్‌కార్డుల సేవలు, కార్డుదారులకు అందిస్తున్న సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యం, బియ్యం నాణ్యతా పరీక్ష ప్రక్రియతో కూడిన పోస్టర్లను, కరపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో 957 రేషన్ దుకాణాల పరిధిలో 5,90,000 రైస్ కార్డులున్నాయని, ప్రతినెలా కార్డుదారులకు దాదాపు 8,400 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉచితంగా అందుతున్నాయన్నారు. అలాగే 52 గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా జరుగుతోందని, దీపం 2.0 పథకాన్ని పటిష్ఠంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు.



ఎస్ఆర్ఆర్ కళాశాల ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన సిబ్బంది, పూర్వ విద్యార్థులు

ప్రభుత్వ భూమి - ప్రజల ఆస్తి కాపాడుకుందాం

● హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు

గుణదల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నూజివీడు జమిందార్లు ఎస్ఆర్ఆర్ కళాశాల ఏర్పాటు సమయంలో ఇచ్చిన స్థలం అన్యాక్రాంతం కాకూడదన్న ఆలోచనతో ప్రభుత్వ భూమి-ప్రజల ఆస్తి కాపాడుకుందాం అనే నినాదంతో బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఆక్రమిత స్థలంలో కళాశాల సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు సంయుక్తంగా గురువారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎస్ఆర్ఆర్ కళాశాల విస్తరణకు నూజివీడు జమిందార్లు ఇచ్చిన 6.67 ఎకరాల భూమి ఆక్రమణదారుల కోరల్లో చిక్కుకుని ఉంది. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు కళాశాల పూర్వ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పలుమార్లు ఆందోళనలు చేశారు. తాజాగా ఇదే విషయమై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్పందించి కళాశాల ఆక్రమిత స్థలం విషయమై నిషేధిత భూమిగా గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఎన్‌టీఎస్ నెంబరు 39, 40 సంబంధిత సర్వే నెంబర్లలోని ఈ భూమిని రిజిస్ట్రేషన్ చట్టం 1908 సెక్షన్ 22 ఏ ప్రకారం నిషేధిత భూమిగా గుర్తించినట్టు ఆదేశాలు జారీ చేశారు. ఈ నిషేధిత భూమిలో ఎవరైన క్రయవిక్రయాలు నిర్వహించినా నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులను కళాశాల పూర్వ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది గురువారం ఏర్పాటు చేశారు.



ధర్నాలో పాల్గొన్న అభ్యర్థులు, సంఘం నేతలు

ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టుల

నోటిఫికేషన్ విడుదల చేయాలి

ధర్నాచౌక్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జీవో 13 ప్రకారం 2260 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి 86వేల మంది ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జీ రామన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో గురువారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. స్పెషల్ ఎడ్యుకేషనల్ కోర్సు పూర్తి చేసి డీఎస్సీ కోసం నిరుద్యోగులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారన్నారు. ఈ ఏడాది జూలై 15లోగా స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినట్టు చెప్పారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు ఇవ్వాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్, డీవైఎఫ్ఐ జిల్లా నేతలు నిజాముద్దీన్, శివ, బసవ, మహేష్, అభ్యర్థులు దివ్య, రాజుకుమార్, సందీప్ నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన జేఏసీ నేతలు, కుటుంబ సభ్యులు

సికింద్రాబాద్ డివిజన్‌ను

విజయవాడలోనే కొనసాగించాలి

ఇబ్రహీంపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు నేపథ్యంలో సికింద్రాబాద్ డివిజన్‌కు సంబంధించి విజయవాడలోని రన్నింగ్ బ్రాంచ్‌ను తెలంగాణకు మార్చాలనే ఆలోచనను విరమించుకొని యథావిధిగా విజయవాడలోనే కొనసాగించాలని రైల్వే కార్మిక యూనియన్స్ ఏజేసీ నేతలు డిమాండ్ చేశారు. రైల్వే లోకో పైలెట్లు, ట్రైన్ మేనేజర్లు సుమారు 550 పైగా కుటుంబాలు గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశమై జేఏసీగా ఏర్పడ్డారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లుగా విజయవాడలోనే రన్నింగ్ ఉందని ఇక్కడి నుంచి సికింద్రాబాద్ డివిజన్‌లోకి రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైళ్లు, గూడ్స్ రైళ్లలో పనిచేసే రన్నింగ్ కార్మికులు ఈ ప్రాంతాల్లో స్థిరపడ్డారని ఇప్పుడు తెలంగాణలోకి బ్రాంచ్‌ను మార్చడం వల్ల అందరం ఇబ్బందులు పడతామన్నారు. రన్నింగ్ బ్రాంచ్ విజయవాడలోనే ఉంచాలని సికింద్రాబాద్ డివిజన్‌లోని ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎసీఆర్ఎంయూ, ఎసీఆర్ఈఎస్, ఏఐసీఆర్ఎస్ఏ, ఏఐజీసీ అండ్ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ధర్నాకు ఎమ్మెల్సీ బొర్రా మద్దతు

గవర్నర్‌పేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 2న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగే ధర్నా జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గురువారం ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. యాప్‌ల భారం తగ్గించాలని ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయులు కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో చేపట్టిన ధర్నాకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్దఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.



ఆ గట్టునున్నావా.. నాగన్న!

రైతన్నలూ జర భద్రం

- ఉమ్మడి కృష్ణాలో ముమ్మరంగా వ్యవసాయ పనులు
- పొలం గట్లపై ప్రమాదకర విషసర్పాల సంచారం
- ఏటా పెరుగుతున్న పాముకాటు మరణాలు
- సత్వరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు



(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

జోరుగా వర్షాలు కురుస్తున్నాయి.. కృష్ణానదికి ఎగువ నుంచి వరద నీరు పోటెత్తుతోంది. పట్టిసీమ జలాలు పుష్కలంగా కాలువలకు చేరుతున్నాయి.. సాగుకు నీరు అందుబాటులో ఉండటంతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతు కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో రైతులు, రైతు కూలీలకు విషసర్పాల రూపంలో ప్రమాదం పొంచి ఉంది. పొలం గట్లపై పాములు సంచరిస్తుంటాయి. గతంలో దివిసీమ ప్రాంతంలో పాము కాటుకు గురై పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. విష సర్పాల బారిన పడకుండా రైతులు, రైతు కూలీలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.



● పాముకాటుకు గురైతే..

పాము కాటుకు గురైతే ముందుగా అది ఏజాతిదో గుర్తించాలి. కరిచినది విష సర్పమో.. కాదో తెలిస్తే బాధితులు కంగారు పడకుండా స్థితిమితంగా ఉండేందుకు వీలుంటుంది. పాము కరిచిన వ్యక్తిలో లక్షణాలు గుర్తించిన తర్వాతే వైద్యం అందిస్తారు. కరిసిన పాము జాతిని తొలుత గుర్తించడం అవసరం.

● బాధితులకు ధైర్యం చెప్పాలి..

పాము కాటుకు గురైన వ్యక్తి భయాందోళన చెందకుండా ధైర్యం చెప్పాలి. విషానికి విరుగుడు ఇంజక్షన్లు ఉన్నాయని, వైద్యుని వద్దకు వెళితే ప్రమాదం నుంచి బయట పడతామని ధీమా కల్పించాలి.

● విషం శరీర భాగాల్లోకి చేరకుండా చూడాలి

పాము కరిచిన చోట కొద్దిగా పై భాగాన రుమాలుతోగాని, తుండుతోగాని బిగించి కట్టి విషం శరీర భాగాలకు చేరకుండా చూసుకోవాలి. తాడు, ప్లాస్టిక్ వైరుతో గట్టిగా బిగించి కట్టరాదు. అలా చేస్తే రక్త ప్రసరణ పూర్తిగా ఆగిపోయే ప్రమాదం లేకపోలేదు. కట్టులో నుంచి ఒక వేలు దూరేంతగా బిగించి కట్టాలి. రెండు లేక మూడు గాట్లుంటే విష సర్పమని, అనేక గాట్లుంటే సాధారణ సర్పమని గ్రహించాలి.

● నోటితో రక్తం పీల్చరాదు

పాము కరిచిన చోట నోటితో రక్తాన్ని పీల్చి ఉమ్మేయటం అంత మంచిదికాదు. పీల్చే వారి నోటిలో గాయాలుంటే అతడికి ప్రమాదం. పాము కరిచిన చోట కొంత భాగం కోసి తీసేయడం చేస్తే గాయం పెద్దది కావచ్చు. పాము కరిచిన వ్యక్తిని నడిపించకుండా వాహనంపై సాధ్యమైనంత త్వరగా దగ్గరలోని వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి. పాము కాటుకు గురైన వ్యక్తికి నోటి ద్వారా ఏవిధమైన ఆహారం పెట్టకూడదు.

● ముందుజాగ్రత్త చర్యలు

పాముకాటుకు గురైన వ్యక్తికి ధైర్యం చెబుతూ త్వరగా ఆసుపత్రిలో చేర్పించాలి. ముందుగా సెలైన్ ఎక్కించాలి. ధనుర్వాతం కాకుండా ముందు జాగ్రత్తగా టెట్వాక్ ఇంజక్షన్ ఇవ్వాలి. రోగిని పరిశీలిస్తూ విష ప్రభావం కనిపిస్తే యాంటీ స్నేక్ వెనెమ్ ఇంజక్షన్ చేయాలి. విష లక్షణాలు కనిపించకుంటే 24 గంటల తర్వాత రోగిని ఆసుపత్రి నుంచి పంపేయవచ్చు. పాము కరిచిన చోట చీముపడితే కోత పెట్టి తొలగించాలి. రక్త పింజర విషం వల్ల మూత్ర పిండాలు పనిచేయకపోవడం.. మెదడులో రక్త స్రావమై కోమాలోకి వెళితే నెఫ్రాలజిస్టు అవసరం ఉంటుంది.

● నాటువైద్యం శ్రేయస్కరం కాదు

తాచుపాము, కట్లపాము, రక్త పింజరలు ఈప్రాంతంలో సంచరించే విష సర్పాలు. వీటి బారిన పడితే యాంటీ స్నేక్ వెనెమ్ ఇవ్వాలి. పాటు కాటుకు గురైన వ్యక్తి నాటు వైద్యంతో సమయం వృథా చేసుకొని ప్రాణాల మీదకు తెచ్చుకునే కంటే వైద్యులను సంప్రదించడమే మేలు.

దుర్గమ్మకు బంగారు సూత్రాలు కానుక



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగి

ఇంద్రకీలాద్రి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన దాసరి సాయి ప్రియాంక తల్లిదండ్రులు దాసరి భారత నరేంద్ర సింహ, రాజేశ్వరి పేరున రూ.1,68,210లు విలువ చేసే గ్రా.16.5మిల్లీ గ్రాముల బంగారు సూత్రాలను గురువారం ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారికి అమ్మవారి దర్శనం కల్పించగా.. వేద పండితులు వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

వేద విద్యార్థుల సేవలు సమాజానికి అందాలి

- ఈవో శీనానాయక్



సౌకర్యాలపై వేద విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఈవో

ఇంద్రకీలాద్రి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వేద విద్యార్థుల సేవలు సమాజానికి అందేలా అన్నిచర్యలు తీసుకుంటామని దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్ అన్నారు. పోరంకిలోని దుర్గామల్లేశ్వర వేద విద్యాలయం (వేద పాఠశాల)ను గురువారం ఈవో తనిఖీ చేశారు. వేద పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధనపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఈవో మాట్లాడారు. విద్యార్థులకు పుస్తకాలు, సౌకర్యాలను తక్షణమే ఏర్పాటు చేయవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు. వేద విద్యార్థులకు సాధ్యమైనంత ఉత్తమమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. పెండింగ్ పనులను సకాలంలో పూర్తిచేయాలని ఇంజనీరింగ్ విభాగానికి సూచించారు.

అనుమతి లేకుండా వస్తే కఠిన చర్యలు

- ముగ్గురు సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్‌పై వేటు
- ప్రైవేటు సెక్యూరిటీ సంస్థకు రూ.25వేలు జరిమానా

ఇంద్రకీలాద్రి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ప్రాంగణంలోకి అధికారుల అనుమతి లేకుండా ఆహార పదార్థాల ఆటోను అనుమతించినందుకు ఆయా ప్రదేశాల్లో విధుల్లో ఉన్న ముగ్గురు ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్‌ను ఈవో వీకే శీనానాయక్ విధుల నుంచి సస్పెండ్ చేశారు. సెక్యూరిటీ సంస్థకు రూ.25వేల జరిమానా విధించారు. కనకదుర్గానగర్ ప్రధాన మార్గం నుంచి ఆటోలో ఐదుగురు వ్యక్తులు పలు ఆహార పదార్థాలను కొండపైకి తీసుకువెళ్లేందుకు మహామండపం లిఫ్ట్ వద్దకు వెళ్లారు. అదే సమయంలో వచ్చిన ఈవో లిఫ్ట్‌ల సమీపంలో ఆటో ఉండటం గమనించి అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల అనుమతి లేకుండా ఆహార పదార్థాలు ఉన్న ఆటోను ఎందుకు అనుమతించారని సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్‌ను ప్రశ్నించారు. ఆటోను అనుమతించినందుకు కనకదుర్గానగర్ ప్రధాన గేట్, చైనా వాల్, గోశాల వద్ద విధుల్లో ఉన్న సెక్యూరిటీ సిబ్బందితో పాటు సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేశారు. ప్రైవేటు సెక్యూరిటీ సంస్థ పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ రూ.25వేలు జరిమానా విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఈవో హెచ్చరించారు. భక్తుల భద్రతే ముఖ్యమని, దేవస్థానం అధికారుల అనుమతి లేకుండా ఆలయ ప్రాంగణంలోకి ఆహారపదార్థాలు తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, అమ్మవారికి మొక్కులు చెల్లించటానికి తులాభారం నిమిత్తం 40 కేజీల బెల్లం, సుమారు 15 కేజీల చక్కెర పొంగలి, పులిహోరలను మూడు స్టీలు క్యాన్‌లలో ఆటోలో తీసుకువెళ్లినట్టు భక్తులు తెలిపారు. అధికారుల అనుమతి తీసుకోవాలని తమకు తెలియదని సెక్యూరిటీ ఉద్యోగులను విధుల నుంచి తొలగించటం అన్యాయమని వారు తెలిపారు.

శాఖల సమన్వయంతో మెరుగైన సేవలు

- జిల్లా ఎస్పీ గంగాధరరావు



మచిలీపట్నం క్రైమ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు పోలీస్‌శాఖ, బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని వివిధ బ్యాంకుల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్బీఐ సూచనల మేరకు ప్రతి బ్యాంకు, ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రాత్రి వేళల్లో ఏటీఎం ప్రాంగణాల్లో వెలుతురు ఉండేలా చూడాలని, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర అలారం, లింకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఏటీఎంల వద్ద అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల గురించి సమాచారం అందించాలన్నారు. ప్రజల ఆస్తి, ధనం సురక్షితంగా ఉండేందుకు శాఖల మధ్య సమన్వయం అవసరమన్నారు. సమావేశంలో జిల్లా అడిషినల్ ఎస్పీ వి.వి నాయుడు, డీఎస్పీలు సీహెచ్ రాజ, శ్రీనివాసరావు, ధీరజ్ వినీల్, విద్యశ్రీ, పోలీసు, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్కార్ సర్వీసుల్లో మార్పు

రైల్వేస్టేషన్ : చెంగల్‌పట్టు-కాకినాడ పోర్టు సర్కార్ ఎక్స్‌ప్రెస్ (17643-17644), కాకినాడ పోర్టు-పాండిచ్చేరి సర్కార్ ఎక్స్‌ప్రెస్ (17655-17656) సర్వీసుల్లో మార్పులు చేసినట్టు విజయవాడ డివిజన్ రైల్వే పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17643 రైలు మంగళ, బుధ, శని, ఆదివారాల్లో.. అలాగే 17644 సోమ, మంగళ, శుక్ర, శనివారాల్లో అక్టోబరు 3వ తేదీ వరకు నడుస్తాయని తెలిపారు. 17655 సర్కార్ ఎక్స్‌ప్రెస్ బుధ, గురు, ఆదివారాలు అక్టోబరు 4వ తేదీ వరకు.. అలాగే 17656 సోమ, గురు, శుక్ర వారాలు అక్టోబరు 2వ తేదీ వరకు నడుస్తాయని తెలిపారు. వేళల్లో ఎటువంటి మార్పులు ఉండవని ఆమె పేర్కొన్నారు.

బాబు స్ఫూర్తిగా పాడి రైతుకు చేయూత

- పీ-4లో కృష్ణా మిల్క్ భాగస్వామ్యం
- పాడిరైతులకు పెయ్యి దూడల సెమెన్‌పై రూ. 100 సబ్సిడీ
- 2025-25 తొలి విడతగా రూ. 13 కోట్లు బోనస్
- చైర్మన్ చలసాని ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తిగా పీ-4లో భాగంగా కృష్ణా మిల్క్ యూనియన్ భాగస్వామ్యంతో పాడి రైతులకు పెయ్యి దూడల సెమెన్‌పై రూ. 100 సబ్సిడీ ఇస్తున్నట్టు యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. పాడి రైతులకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి తొలి విడత బోనస్ (ఏప్రిల్ 25 నుంచి జూలై 25 వరకు) సుమారు రూ.13 కోట్లను ఆగస్టులో చెల్లించేందుకు పాలకవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గురువారం చిట్టినగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో చలసాని మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు పీ-4 స్ఫూర్తిగా కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులను ఆదుకునేందుకు అంకితభావంతో పనిచేస్తుందన్నారు. దీనిలో భాగంగా పెయ్యి దూడల సెమెన్ డోస్ ధర రూ.150 కాగా, ఉమ్మడి కృష్ణాజిల్లాలో పాడి రైతులకు కేవలం రూ.50కే అందించి, రూ.100 యూనియన్ భరిస్తుందన్నారు. ఇది పీ-4 లక్ష్యాలతో పూర్తిగా అనుసంధానమై ఉంటుందన్నారు. అలాగే పశువుల హాస్టల్స్‌ను అవనిగడ్డ పరిధిలోని పెదకళ్ళేపల్లి గ్రామంలో, నందిగామ పరిధిలోని మునగచెర్ల గ్రామంలో త్వరలో ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. యూనియన్ పరిధిలోని పాడి రైతులకు తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సంకల్పించామన్నారు. ఈ సదుపాయం ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా పాడి రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆశ్రం హాస్పటల్ సీఈవో హనుమంతరావు, పిన్నమనేని హాస్పటల్స్ సూపరింటెండెంట్ అనిల్ మాట్లాడుతూ, యూనియన్ పాలకవర్గం కోరిక మేరకు పాడి రైతులకు రాయితీపై వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు, పాలక వర్గసభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జోగికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న పాలంకి వర్గీయులు

జోగికి నిరసన సెగ

- రెడ్డిగూడెం వైసీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు
- పాలంకిని కలుపుకుపోవడం లేదని కేడర్ ఆందోళన

రెడ్డిగూడెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రెడ్డిగూడెం వైసీపీలో వర్గ విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. జోగి వర్గానికి జడ్పీటీసీ పాలంకి విజయ్‌భాస్కర్ రెడ్డి వర్గానికు మధ్య నివురు కప్పిన నిప్పులా ఉన్న విభేదాలు బహిర్గతమయ్యాయి. వైసీపీ చేపట్టిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం రెడ్డిగూడెం వచ్చిన మాజీమంత్రి జోగి రమేష్‌కు స్థానిక జడ్పీటీసీ, వైసీపీ కీలకనేత పాలంకి విజయ్‌భాస్కర రెడ్డి వర్గీయుల నుంచి నిరసన సెగ తలిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పాలంకి తన వర్గీయులతో పెద్ద ఎత్తున ర్యాలీగా సమావేశానికి వచ్చారు. పాలంకి వర్గీయులు జై పాలంకి, వర్ధిల్లాలి విజయ్‌భాస్కర్ రెడ్డి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. జోగి రమేష్ మైలవరం సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి జడ్పీటీసీ వర్గాన్ని విస్మరించారని కలుపుకొని పోవడం లేదని, మండల, గ్రామ కమిటీ ఏర్పాటులో ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని సభలో పెద్ద ఎత్తున నిరసన తెలపడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఏదైనా ఉంటే తర్వాత మాట్లాడుకుందామని సభను సజావుగా సాగనివ్వాలని జడ్పీటీసీ పాలంకిని జోగి బ్రతిమాలుకోవడంతో అతను స్టేజ్ పైకి వచ్చి ఆయన వర్గీయులను శాంతింపచేశాడు.

నేడు, రేపు సీపీఐ జిల్లా మహాసభలు

- హాజరుకానున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



జగ్గయ్యపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : జగ్గయ్యపేటలో శుక్ర, శనివారాల్లో ఎన్టీఆర్ జిల్లా సీపీఐ ద్వితీయ మహాసభలు జరుగనున్నాయి. మహా సభలకు ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరుకానున్నట్టు జిల్లా కార్యదర్శి దోనేపుడి శంకర్ తెలిపారు. ఉదయం కోదాడ రోడ్డులో పార్టీ కార్యాలయం వద్ద సీనియర్ నేత మహ్మద్ మన్సూర్ స్మారకస్థూపావిష్కరణ, అనంతరం బలుసుపాడు జంక్షన్ వరకు కార్యకర్తలు, అనుబంధ సంఘాల కార్యకర్తలతో భారీ ర్యాలీ, పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బహిరంగసభ నిర్వహించనున్నట్టు శంకర్ తెలిపారు. రామకృష్ణతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నేతలు హాజరవుతారని చెప్పారు. శనివారం రెండోరోజు ప్రతి నిధుల సభ ఎస్వీఎస్ కల్యాణ మండపంలో జరుగుతుందని తెలిపారు. మహాసభలను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికసంఘం (ఏఐటీయూసీ అనుబంధం) అధ్యక్షుడు నీలకంఠం శివప్రసాద్ పిలుపునిచ్చారు.

గంజాయిపై ఉక్కుపాదం

(5వ పేజీ తరువాయి)

ధ్వంసం చేశాం.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాం. గత నవంబర్‌లో ఆరు శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశాం. 28 మంది శిక్షణ పొందిన మహిళా సిబ్బందిని మోటార్ సైకిళ్లపై పహారాకు నియమించాం. కాలేజీలు, మార్కెట్లు, బస్‌స్టేషన్లు హాట్‌స్పాట్‌లుగా గుర్తించి ఈవ్‌టీజింగ్‌ను అరికట్టగలిగాం. గృహహింస, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్ వంటి కేసుల్లో తక్షణ చర్యలు తీసుకోవటం ద్వారా నేరం జరిగే తీవ్రతను తగ్గించగలిగాం. వేగంగా స్పందించటంతో మహిళల్లో భద్రతా భావనను పెంపొందించాం. జిల్లాలో శక్తి యాప్‌ను 5.32 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయటం ద్వారా విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం.

సాంకేతికతతో కేసుల ఛేదన

కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోంది. పెనమలూరు డబుల్ మర్డర్ కేసులో టవర్ డంప్ సీసీటీవీ ఆధారాలతో నిందితులను అరెస్టు చేయగలిగాం. చల్లపలి హత్య కేసులో పొటాషియం సైనైడ్ వాడిన నిందితులను సాంకేతిక ఆధారాలతో పట్టుకున్నాం. సీసీ కెమెరాల ద్వారా బైక్ దొంగలను పట్టుకుని 70 లక్షల విలువైన 90 వాహనాలను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించాం.

పటిష్ట నిఘా

జిల్లా వ్యాప్తంగా 4,040 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రజా ప్రదేశాల్లో 2,550, ఆలయాల్లో 407, చర్చిల్లో 247, మసీదుల్లో 74 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి. డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత నిఘా మరింత సులభతరం అయ్యింది. పబ్లిక్ మీటింగ్, వీఐపీ పర్యటనలు, పండగలు, అత్యవసర పరిస్థితుల్లో డ్రోన్‌లను వినియోగిస్తున్నాం. ఎన్‌ఏటీగిడ్ ద్వారా 123 కేసులను వేగవంతంగా ఛేదించగలిగాం. చోరీకి గురైన 702 మొబైల్ ఫోన్‌లను ఎంఎంటీఎస్ సహాయంతో స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించాం.

కీలకమైన కేసుల్లో శిక్షలు పడేలా కృషి

2024-25లో వివిధ నేరాలకు సంబంధించి 220 తీర్పులు వచ్చాయి. హత్యలు, పోక్సో కేసులకు సంబంధించి సమగ్ర ఆధారాలను సమర్పించటంతో చాలామందికి కోర్టులు జీవిత ఖైదు విధించాయి. కొంత మందికి 20 ఏళ్ల పైబడి శిక్షలు పడ్డాయి. కోర్టు మానిటరింగ్ సిస్టం పటిష్ట పరచటం ద్వారా నేరాలను చేసిన వారికి శిక్షలు త్వరితగతిన వేయించగలిగాం. లోక్ అదాలత్ ద్వారా 4,436 కేసులు పరిష్కరించి రాష్ట్రంలో మూడో స్థానంలో జిల్లాని నిలబెట్టాం.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. 244 మంది బదిలీల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాం. వారి వ్యక్తిగత సమస్యల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరిస్తున్నాం. వార్షిక క్రీడలు, ఆరోగ్య కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది తాలూకు రావలసిన ఎరియర్స్ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నాం. కారుణ్య నియామకాల విషయంలో త్వరితగతిన స్పందించటం ద్వారా వారికి న్యాయం చేస్తున్నాం. రిటైర్ అయిన సిబ్బందికి అందవలసిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

వసూళ్ల ఏటీఎస్‌లు

(5వ పేజీ తరువాయి)

ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. అక్రమ వసూళ్ల విషయాలను కొందరు వాహనదారులు రవాణా అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. గతంలో రవాణా శాఖ పరిధిలో వాహనాల ఫిట్‌నెస్‌లను విజయవంతంగా చేయించటానికి మధ్యవర్తులుగా ఎవరైతే పనిచేసేవారో వారే ఏటీఎస్ కేంద్రాల్లో చక్రం తిప్పుతున్నారు.

ఎవరీ మధ్యవర్తులు? ఎక్కడి వారు?

ఉమ్మడి జిల్లాలో పెద్ద టిప్పర్ల యజమానుల నుంచి అక్రమ వసూళ్లకుగానూ అవినీతి రవాణా ఇన్‌స్పెక్టర్ల సిండికేట్ ఒక వ్యక్తిని నియమించుకుంది. ఈ ప్రైవేట్ కలెక్షన్ మాస్టర్‌పై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. గన్నవరం ఎఫ్‌సీ స్టేషన్‌లో వాహనాలకు రంగులు వేసే కార్మికుడి దగ్గర సహాయకుడిగా వచ్చిన వ్యక్తి ఇప్పుడు ఉమ్మడి కృష్ణా జిల్లాలో అవినీతి రవాణా ఇన్‌స్పెక్టర్ల సిండికేట్‌కు వసూళ్ల మాస్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ వ్యక్తే ఇప్పుడు ఉమ్మడి జిల్లాలోని ఏటీఎస్‌లలో చక్రం తిప్పుతున్నాడు. మరో ముగ్గురు మధ్యవర్తులను నియమించుకుని వసూళ్లు చేస్తున్నాడు. ఈ అక్రమాల్లో కొందరు రవాణా ఇన్‌స్పెక్టర్ల భాగస్వామ్యం కూడా ఉందన్న ప్రచారం నడుస్తోంది.

సమస్యలున్న వాటినుంచే అక్రమ వసూళ్లు

అన్ని వాహనాల నుంచి అక్రమ వసూళ్లు చేయట్లేదు. సమస్యలున్న వాటి విషయంలోనే వసూళ్లకు పాల్పడుతున్నారు. వాహనాలకు నల్లటి పొగ వస్తే ఇంజన్ సమస్య ఉన్నట్టుగా భావించాల్సి ఉంటుంది. ఈ నల్లటి పొగ సమస్యను ఏటీఎస్ కేంద్రాల్లోనే సరిచేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. దీనికోసం లంచాలు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ డబ్బు ఇవ్వకపోతే పలు కారణాలు చూపి ఫిట్‌నెస్‌లు చేయకుండా కాలాతీతం చేస్తున్నారు. అదేమంటే.. చాలా వాహనాలకు ఫిట్‌నెస్ చేయాల్సి ఉందని తప్పించుకుంటున్నారు.

రయ్ రయ్!

(5వ పేజీ తరువాయి)

కలవపాముల - వెంట్రప్రగడ మధ్య జరిగిన రహదారి ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య షాక్‌కు గురైంది. దాదాపుగా 3.6 కిలోమీటర్ల మేర రహదారిని అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రమాదాల నిలయంగా మారిన ఈ రహదారి పరిస్థితి గురించి బాలశౌరి, గడ్కరీకి సమగ్రంగా వివరించారు. దీంతో గడ్కరీ సానుకూలంగా స్పందించటంతో పాటు అప్పటికప్పుడు క్లియరెన్స్ ఇచ్చారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుకు భూ సేకరణతో కలిపి దాదాపుగా రూ.600 కోట్ల వ్యయం కానుంది. నిర్మాణ ఖర్చు రూ.300 కోట్లు పైబడి అయ్యేఅవకాశం ఉంది. ఈ నిధులను అతి త్వరలో విడుదల చేసే అవకాశం ఉంది.

మచిలీపట్నం పోర్టు రోడ్డుకు రూ.350 కోట్లు మంజూరు

మచిలీపట్నం సౌత్ పోర్టు నుంచి ఎన్‌హెచ్ - 65 వరకు ఆరు వరసలు 18.5 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు రూ.350 కోట్లను మంజూరు చేస్తున్నట్టు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మచిలీపట్నం సౌత్ పోర్టు నుంచి రైస్ మిల్ వరకు వస్తూ ఎన్‌హెచ్ - 65ను అనుసంధానిస్తుంది. ఈ రోడ్డు వల్ల మచిలీపట్నం పోర్టు నుంచి సరకు రవాణాకు దోహదపడుతుంది. ఈ ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలను బలోపేతం చేస్తుంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో భాగంగా మొత్తం ఏడు అండర్ పాస్‌లు, మూడు ఫ్లైఓవర్ల నిర్మాణం జరుగుతుంది. బీచ్ రోడ్‌లో కూడా ఒక ఫ్లై ఓవర్‌ను నిర్మిస్తారు.

మంగినపూడి బీచ్ రోడ్డు నాలుగు లేన్లుగా అప్‌గ్రేడ్

మంగినపూడి బీచ్ రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా అప్‌గ్రేడ్ చేయటానికి గడ్కరీ అంగీకరించారు. మొత్తం 11.7 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న మంగినపూడి బీచ్ రోడ్డు తీరప్రాంతం, మచిలీపట్నం పట్టణం మధ్య కీలకమైన లింక్‌గా పనిచేస్తుంది. ఈ రోడ్డును నాలుగు లేన్లుగా అప్‌గ్రేడ్ చేయడం వల్ల రవాణా మెరుగుపడుతుంది, పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది. స్థానిక ఆర్థికాభివృద్ధికి ఊతం ఇస్తుంది.

కేంద్ర మంత్రి దృష్టికి గుడివాడ పట్టణ రహదారులు

గుడివాడ పట్టణ పరిధిలో జాతీయ రహదారి 216 హెచ్ పై తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వార్షిక ప్రణాళిక కింద రూ.18.50 కోట్ల నిధుల కోసం ఎంపీ బాలశౌరి కేంద్ర మంత్రి గడ్కరీకి నివేదించారు. గుడివాడ పట్టణం నుంచి ఎన్‌హెచ్ - 216హెచ్ వరకు అనుసంధానంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని మరో ప్రతిపాదన అందించారు. గుడివాడ పట్టణంలో ఫ్లై ఓవర్‌కు అనుసంధానంగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. గుడివాడ పట్టణ పరిధిలో ఎన్‌హెచ్ - 165, ఎన్‌హెచ్ - 216హెచ్‌ల మధ్య అనుసంధాన ప్రాంతంలో గ్యాప్‌లు ఉన్న చోట్ల విస్తరణ పనులకు రూ. 28.50 కోట్ల మేర రూపొందించిన డీపీఆర్‌ను గడ్కరీకి అందించటం జరిగింది.

ఉద్యోగం పేరుతో రూ.6.65 లక్షలు స్వాహా

పెనమలూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పార్టు టైం ఉద్యోగం ఉందని, మొబైల్‌లో కొన్ని గంటలు మాత్రమే పని చేయాలని మభ్యపెట్టి విడతలవారీగా ఓ మహిళ నుంచి రూ.6.65లక్షలు స్వాహా చేసిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యనమలకుదురు గ్రామానికి చెందిన తనూజ ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. ఆమె ఫోన్‌కు అథేవా సర్వీస్ అనే సంస్థ నుంచి ఏప్రిల్ 10న పార్టుటైం ఉద్యోగం ఉందని సందేశం వచ్చింది. కొన్నిగంటలు మాత్రమే పని చేయాలని, రోజువారీ చెల్లింపులు ఉంటాయని చెప్పడంతో ఆమె వారి టెలిగ్రామ్ గ్రూపులో చేరింది. కొద్ది రోజులు కొంత మొత్తం సంపాదించిన తనూజ విడతల వారీగా వారికి రు.6,65,000 పంపింది. కానీ వారు తిరిగి డబ్బు ఇవ్వకపోగా మరో పదిలక్షలు పంపాలని ఒత్తిడి చేస్తుండటంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తిమ్మరుసు బావి (ఫైల్‌ఫొటో)

ఆక్రమణల చెరలో 'తిమ్మరుసు' బావి

ఇబ్రహీంపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): 14వ శతాబ్దంలో కొండపల్లి సంస్థానాన్ని పాలించిన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో మంత్రిగా ఉన్న తిమ్మరుసు తమ పరివారం కోసం ఇబ్రహీంపట్నంలో తవ్వించిన బావి (తిమ్మరుసు) అటుతర్వాత ఎందరికో ఉపయోగపడింది. ప్రస్తుతం ఆక్రమణ చెరలో ఉంది. ఇబ్రహీంపట్నంలోని ఆర్.ఎస్ నంబరు 226/2లో పురావస్తుశాఖకు చెందిన ఈ బావి ఆక్రమణ చెరలో ఉంది. ఉప్పుతల వారి గోత్రికుల చేత ప్రతిష్ఠించబడిన శ్రీమహాలక్ష్మి దేవాలయంలో ఏడాదికి ఒకసారి కొలువులు జరుగుతుంటాయి. 24 సంవత్సరాలుగా బావి పక్కనే ఉన్న అమ్మవారి ఆలయంలో పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తామని ఉప్పుతల వెంకటలక్ష్మి తెలిపారు. బావితో పాటు ఉన్న 38 సెంట్లలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆమె అధికారులను కోరారు.



బావి ఆనవాళ్లు లేకుండా ఆక్రమణలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475	

రాత్రి వేళల్లో గస్తీ అభినందనీయం : డీఎస్పీ

గుడివాడ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గుడివాడ రూరల్ మండలంలో ట్రైనీ ఎస్సై లోకేశ్వరి రాత్రి సమయాల్లో గస్తీ తిరుగటం గొప్ప విషయమని డీఎస్పీ ధీరజ్ వినిల్ అన్నారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ట్రైనీ ఎస్సైని అభినందించి మెమొంటో అందజేశారు. పేకాట, తదితర విషయాలపై నిఘా పెట్టి నియంత్రించారని తెలిపారు. రూరల్ ఎస్సై చంటిబాబు పాల్గొన్నారు.


డీఎస్పీ ధీరజ్ వినిల్ నుంచి అవార్డు అందుకున్న ట్రైనీ ఎస్సై లోకేశ్వరి

జల్ జీవన్ జలం అందేదెప్పుడు..!

- కరెంటు కనెక్షన్ లేక నిరుపయోగం
- పనులు పూర్తి చేసినట్టు బోర్డు ఏర్పాటు
- కనెక్షన్‌లు ఇవ్వకుండా వదిలేసిన పైపులు

(ఆంధ్రజ్యోతి - తోట్లవల్లూరు) : ఇంటింటికీ కుళాయి కనెక్షన్ లక్ష్యంతో తోట్లవల్లూరులో జల్ జీవన్ మిషన్ కింద రక్షిత మంచినీటి పథకం నిర్మించి రెండేళ్లు దాటినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. పనులన్నీ పూర్తయినా రెండేళ్ల నుంచి కరెంట్ కనెక్షన్ తీసుకురాలేకపోవటం అధికారుల వైఫల్యానికి నిదర్శనంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో 2022లో సౌత్‌వల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డులో కేంద్రప్రభుత్వం తన వాటా రూ 57.25 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ 57.25 లక్షలు కలిపి రూ. 1,14,50,000 వేలతో రక్షిత మంచినీటి పథకం నిర్మించారు. ట్యాంకు నిర్మించి బోరువేసి సబ్‌మెర్సిబుల్ మోటారు కూడా వేశారు. అయితే మోటారుకి కరెంటు కనెక్షన్ లేక పథకం లక్ష్యం నీరుగారింది. ఈ పథకం 2023 జూన్ 13వ తేదీతో పూర్తయినట్టు సదరు ఇంజనీరింగ్ అధికారులు బోర్డు సైతం ఏర్పాటు చేశారు. పని పూర్తయినట్టు పెట్టిన బోర్డుని చూసి ప్రజలు విస్తు పోతున్నారు. ఈ ట్యాంకు ద్వారా కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు 7,104 మీటర్లు పైపులైన్ విస్తరణ చేసి భూమిలో వేసిన పైపులు రోడ్లపైనే ఉండి వెక్కిరిస్తున్నాయి.

విద్యుత్ శాఖకు డీడీ కట్టాలి

కాంట్రాక్టరు పని పూర్తి చేసేశారు. అయితే మోటారుకి కరెంటు కనెక్షన్ కోసం తమ శాఖ నుంచి విద్యుత్ శాఖకు రూ 3.50 లక్షలు డీడీ కట్టాల్సి ఉంది. నిధులు లేక తాము చెల్లించలేకపోయాం. ప్రభుత్వం నిధులు ఇచ్చిన తరువాత డీడీ కడతాం.కరెంటు కనెక్షన్ లేకపోవటం వల్లే ప్రారంభోత్సవం చేయలేదు.

సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ


రక్షిత మంచినీటి పథకం


పూర్తి చేసినట్టు అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు


కుళాయి కనెక్షన్‌లు ఇవ్వకుండా వదిలేసిన పైపులు

కుళాయి లేని గృహాల ప్రజలు ఈ పథకం కింద ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇస్తారని ఎదురు చూసి నిరుత్సాహపడ్డారు. అయితే కొన్నిచోట్ల పాత కుళాయి ఉండగానే ప్రక్కనే రెండో కుళాయి ఏర్పాటు చేసి మంచినీళ్లు ఇస్తామన్నట్టుగా అధికారులు వ్యవహరించారని ఆరోపణలున్నాయి.


అన్నదానం చేస్తున్న ఆలయ ఈవో గోపాలరావు

భక్తులకు అన్నసమారాధన

గుడివాడ, జూలై 31(ఆంధ్రజ్యోతి) : స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసియున్న గౌరీశంకరస్వామి దేవస్థానంలో ఉపాలయమైన షిర్డీ సాయిబాబా మందిరంలో ఆఖరి గురువారం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 1500మంది పాల్గొన్నారు. దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా, రామయ్య

మొవ్వ మాజీ సర్పంచ్ మృతి

కూచిపూడి: మొవ్వ మాజీ సర్పంచ్ సంకుల కోటేశ్వరరావు (78) అనారోగ్యంతో గురువారం మొవ్వలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, మాజీ శాసనసభ్యుడు పాటూరి రామయ్య, ఉప్పులేటి కల్పన తదితరులు శ్రద్ధాంజలి ఘటించి కోటేశ్వరరావు కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.

అసభ్యప్రవర్తనపై కేసు నమోదు

గుడివాడ రూరల్: మోటూరుకు చెందిన ఇబ్బా శివయ్య అనే వ్యక్తి తమ కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేసినట్టు ఎస్సై చంటిబాబు తెలిపారు. ఈ నెల 28వ తేదీన దివ్యాంగురాలైన తన కుమార్తెతో అసభ్యంగా ప్రవర్తించారని, తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ఉత్పత్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించండి

● మున్సిపల్ కమిషనర్ మనోహర్

గుడివాడ, జూలై 31(ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాల ఉత్పత్తులను ప్రోత్సహించాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా పట్టణ పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన (మెప్మా బజారు)డ్వాక్రా ఉత్పత్తుల అమ్మకం, ప్రదర్శనను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు తయారు చేసిన వస్తువులు, తినుబండారాల అమ్మకాలు, ప్రదర్శన ప్రతి నెలా ఏర్పాటుచేస్తున్నారన్నారు. మెప్మా బజారులో 25 నుంచి 40 రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని, వాటిని పట్టణ ప్రజలు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసుబాబు సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పెదపారుపూడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గత 34 సంవత్సరాలుగా విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన కొలుసు ఏసుబాబు పదవీ విరమణ చేయటం బాధాకరమని స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా పని చేస్తున్న కొలుసు ఏసుబాబు పదవీ విరమణ సందర్భంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అభినందన సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందుతూ సుదీర్ఘకాలం పని చేయటం అభినందనీయమన్నారు. పదవీ విరమణ ప్రతి ఉద్యోగికీ తప్పదని, అయినప్పటికీ ఆయన ఎంతో ఉత్సాహంగా పని చేస్తున్నారని తెలిపారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏసుబాబు దంపతులను కుమార్ రాజా ఘనంగా సత్కరించారు. ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు , ఎంపీడీవో జె.విమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు, పాల్గొన్నారు.


ఏసుబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

ఎలుకల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

● ఏడీఏ కె.శ్రీనివాసరావు

గుడివాడ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతులు నాట్లు వేసిన తర్వాత ఎలుకల నిర్మూలన చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.శ్రీనివాసరావు అన్నారు. గురువారం గుడివాడ రూరల్ మండలం సెరివేల్పూరులో వ్యవసాయ శాఖ యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నానో డీఏపీ ఎక్కువగా వినియోగించాలని, యూరియాను తక్కువగా వాడాలని తెలిపారు. యూరియా ఎంత తక్కువగా వాడితే రైతులకు అంత మంచిదని చెప్పారు. భూసారం పెరుగుతుందని తెలిపారు. ప్రతీ రైతు సేంద్రియ వ్యవసాయంతోపాటు పశువుల పేడ, ఇతర ఎరువులు వేయాలన్నారు. జీలుగ, పిల్లి పెసర వేసుకుని దుక్కులు దున్నుకోవాలన్నారు. రసాయనిక ఎరువులు తగ్గించుకుని సేంద్రియ వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలని కోరారు. ఆధునిక పద్ధతులను వినియోగించి ఎక్కువ లాభాలు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏవోలు బోలెం అనంతలక్ష్మి, శ్రీదేవి, వీఏఏలు, వ్యవసాయశాఖ సిబ్బంది , రైతులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ కె.శ్రీనివాసరావు

తాగునీటి పంటబోదె పరిశీలన

గుడ్లవల్లేరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సింగలూరులో తాగునీటి చెరువుకు నీటిని సరఫరా చేసే పంటబోదె విషయమై గ్రామస్థులు పిర్యాదు మేరకు గుడ్లవల్లేరు ఎంపీడీవో గురువారం సింగలూరు గ్రామానికి వెళ్లారు. అక్కడి తాగునీటి చెరువును, నీటిని సరఫరా చేసే బోదెను, గ్రామస్థులు ఏర్పాటు చేయబోయిన కంచెకు సంబంధించిన విషయాలను ఆయన పరిశీలించారు. కాగా ఈ చెరువులో కలుషిత నీరు చేరి గ్రామంలో పలువురు చర్మవ్యాధులకు గురైయ్యారని తమ సమస్యను పరిష్కరించాలని వారు ఎంపీడీవోను కోరారు. కాగా నీటిని సరఫరా చేసే బోదె విషయమై సంబంధిత చేను రైతును పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సర్పంచ్‌తో మాట్లాడి రాజీ మార్గానికి రావాలని సూచించారు. చెరువులో నీరు కలుషితం కాలేదన్నారు. గ్రామస్థులు తనను కలిశాక చెరువులో నీటి శ్యాంపిల్ తీసి లాబ్‌లో పరీక్షలు చేశామని నీరు పరిశుభ్రంగానే ఉన్నట్టు సర్టిఫికెట్ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖవారు ఇచ్చారని దాని గురించి ఆందోళన చెందవద్దని ప్రజలకు భరోసా ఇచ్చారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఇమ్రాన్

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

● ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ, జూలై 31(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక 7వ వార్డు, ఎన్టీఆర్ కాలనీలో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టి గురువారం వార్డు సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్‌ల బిగించడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఇప్పటికే విద్యుత్ బిల్లును పెంచి సర్దుబాటు చార్జీలు, ట్రూఆప్ చార్జీలు పేరుతో సామాన్యుడి నడ్డివిరుస్తున్నారన్నారు. పెరిగిన బిల్లులను కట్టలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి అధ్యక్షులు లంకా సురేంద్ర, సీఐటీయూ నాయకులు పి.రజిని, సత్యవతి, శనగపాటి నాగేశ్వరరావు, యమ్.డి భాషా, బసవలింగం, మాలమహానాడు నాయకులు పంతగాని సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అడ్మిన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌సీపీ రెడ్డి

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

పామర్రు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లో నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు ఎంపీడీవో కాంద్రు జ్యోతి గురువారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు ఒకటోతేదీ నుంచి నూతనంగా మంజూరైన స్పౌజ్ కోట పెన్షన్లు లబ్ధిదారులకు సైతం ఉదయం నుంచి ఇంటింటికీ తిరిగి పింఛన్లను గ్రామ సచివాలయ ఉద్యోగసిబ్బంది నూరుశాతం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని ఆమె చెప్పారు. ఈ మేరకు గ్రామ సచివాలయ ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గుత్తికొండ కిషోర్ పాల్గొన్నారు.


పోస్టు కార్డు ఉద్యమంలో భద్రతా దళం సభ్యులు

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని నిరసన

పెదపారుపూడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గుడివాడ నుంచి కంకిపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌కు భవిష్యత్ భద్రతా దళం ఆధ్వర్యంలో ప్రజలతో పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టినట్టు ఆ దళం వ్యవస్థాపకుడు వైవి.మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదపారుపూడి నుంచి వానపాముల వంతెన వరకు, అలాగే వెంట్రప్రగడ దాటిన తర్వాత కలువపాముల వరకు ఆర్ అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు తక్షణమే చేపట్టాలని గవర్నర్‌కు పోస్టు కార్డుల ద్వారా తెలియపర్చబోతున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిష్యత్ భద్రతా దళం సభ్యులు మహ్మద్ తాహెరా భాషా, జి.పూర్ణచంద్రరావు, సయ్యద్ నజీర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ చోరీ

గుడివాడ రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు పార్కు చేసిన ట్రాక్టర్ ట్రాలీ బుధవారం అర్ధరాత్రి చోరీకీ గురైంది. మోటూరుకు చెందిన జోజి శేరీగొల్వేపల్లి రోడ్డులోని తన ట్రాక్టర్ ట్రాలీని ఇంటి ఎదుట పార్కు చేశాడు. బుధవారం అర్ధరాత్రి 2.30 సమయంలో గుర్తుతెలియని వ్యక్తి సోనాలికా ట్రాక్టర్ సహాయంతో ట్రాలీని చోరీ చేశాడు. మోటూరులోని ప్రధాన రహదారుల గుండా కాకుండా బ్యాంకు సందులో నుంచి తీసుకువెళుతుండగా బ్యాంకు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. అయితే ట్రాక్టర్ డ్రైవర్ తెలివిగా కెమెరా వచ్చే సమయానికి ముఖానికి చెయ్యి అడ్డు పెట్టుకున్నాడు. అదే రీతిలో మల్లాయిపాలెం రోడ్డు, మోటూరు అడ్డరోడ్డులోని పెట్రోల్ బంకుల మీదగా ముదినేపల్లి మండలం పెదపాలపర్రు వరకు తీసుకువెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. మోటూరు రోడ్డులోని వైన్ షాపులో, బంకులో ఉన్న సీసీ కెమెరాల్లో ట్రాలీని తీసుకుపోతున్నట్టు రికార్డైంది. సీసీ కెమెరాలనున్న చోట ట్రాక్టర్ డ్రైవర్ ముఖానికి చెయ్యి అడ్డుపెట్టుకుని వెళ్లడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోనాలికా ట్రాక్టర్ ఇంజన్ మాత్రం కల్వపూడి అగ్రహారం, పర్నాసల మీదగా వెళ్ళినట్టు ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డైంది. పెదపాలపర్రు నుంచి ట్రాలీ ఎక్కడికి వెళ్లిందనేది మిస్టరీగా మిగిలింది. ట్రాక్టర్ యజమాని అర్ధరాత్రి 3గంటల సమయంలో 100కి ఫోన్ చేయగా, రూరల్ ఎస్సై చంటిబాబు నేతృత్వంలో పోలీసులు వెంటనే స్పందించి గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విజిలెన్స్ విచారణ

పమిడిముక్కల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పమిడిముక్కల విద్యుత్ సబ్‌స్టేషన్‌పై ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. మండల పరిధి తాడంకిలో అక్రమలే అవుట్‌లో విద్యుత్ లైన్ల ఏర్పాటుకు సంబంధించి సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ చేసిన ఫిర్యాదు మేర ఏపీసీపీడీసీఎల్ ఎండి పుల్లారెడ్డి విచారణకు ఆదేశించారు. దీంతో ఈఈ సయ్యద్ ఆసీఫ్, పర్సనల్ ఆఫీసర్ జి.మారుతి సబ్‌స్టేషన్‌కు వచ్చి శ్రీనివాసగౌడ్ , యుఎఫ్ఆర్టీఐ కోస్తా జిల్లాల కన్వీనర్ బేతపూడి జోగేశ్వరరావు, ఉయ్యూరు మండల కన్వీనర్ బొల్లా శివపార్వతి, పమిడిముక్కల మండల కన్వీనర్ సాకే రాములమ్మ సమక్షంలో విచారణ జరిపారు. పామర్రు ఏడీఈ సుందరరావు, పమిడిముక్కల ఏఈ శ్రీనివాసరావు, ఎల్ఐ ప్రసాద్ విచారణ అధికారులకు వివరాలు తెలియజేశారు. విచారణ నివేదికను ఏపీసీపీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌కు అందజేయనున్నట్టు విచారణ అధికారులు తెలిపారు.


విచారణ జరుపుతున్న విజిలెన్స్ అధికారులు


సిద్ధేంద్ర యోగికి నాట్య నీరాజనాలు అర్పిస్తున్న విద్యార్థులు

కూచిపూడి నాట్య పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు

కూచిపూడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన ఎంపీఏ నాట్య పరీక్షల్లో 17 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 17 మంది ఉత్తీర్ణులై నూరుశాతం ఫలితాలు సాధించినట్టు కళాపీఠం ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, నాట్య అధ్యాపకులు యేలేశ్వరపు శ్రీనివాస్, వి.దుర్గా భవాని, ఫణి కుమార్, హరనాథ శాస్త్రి, ఉత్తీర్ణులై విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

మమత వృద్ధాశ్రమంలో భోజన వసతి

గుడివాడ, జూలై 31(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియం కమిటీ మాజీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా ఆనంద్ థియేటర్ శ్యామ్, ఆనంద్ అభిమానుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక బైపాస్‌రోడ్డులోని మమత వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనవసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ థియేటర్ శ్యామ్, ఆనంద్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

● జడ్పీ సీఈవో కన్నమనాయుడు


పరిసరాలను పరిశీలిస్తున్న సీఈవో కన్నమనాయుడు

గుడివాడ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు వెంటనే పరిష్కరించాలని జడ్పీ సీఈవో కన్నమనాయుడు అన్నారు. దొండపాడు నుంచి వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించటానికి సీఈవో ఇంటింటికి తిరిగి తాగునీరు సరిగా వస్తుందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరించే వారు ప్రతీ రోజు సరిగా వస్తున్నారా? లేదా అని తెలుసుకున్నారు. గ్రామస్థుల నుంచి ఫిర్యాదులు అందుకున్నారు. గ్రామస్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని, కార్యదర్శులు ఫిర్యాదులు పరిష్కరించకపోతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, కార్యదర్శి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి

● ఎస్సైలు రాజేంద్రప్రసాద్, సత్యకళ

పామర్రు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సైలు రాజేంద్రప్రసాద్, సత్యకళలు పేర్కొన్నారు. బల్లిపర్రు అడ్డరోడ్డువద్ద గురువారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనదారులు వాహనం నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్సు కలిగి యుండాలన్నారు.


పామర్రులో..

గుడివాడ : స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఏలూరురోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ట్రాఫిక్ ఏఎస్సై భాగ్యవతి, క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. రూల్స్ స్టిక్కర్‌లను వాహనాలకు అంటించి, గులాబీ పువ్వులను అందజేశారు. వేగం కన్నా ప్రాణం మిన్న అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని ట్రాఫిక్ ఏఎస్సై భాగ్యవతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కోన రామారావు, కార్యదర్శి దిమ్మిటి శ్రీనివాసరావు, తమ్మినేని రామ్మోహన్, శివరామకృష్ణ, అర్జా ప్రసాద్, మున్నలూరి రామకృష్ణ, సత్యనారాయణ, పి.వి సత్యనారాయణ, బ్రహ్మాజీ, వెంకటేశ్వరరావు, కందిపల్లి సూరి, కురాకుల శ్రీవిష్ణు, శైలజ పాల్గొన్నారు.


గుడివాడలో..

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475



మార్కెట్‌యార్డులో జంగిల్ క్లియరెన్స్

బంటుమిల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మల్లేశ్వరం మార్కెట్ యార్డు ఆవరణంలో పేరుకుపోయిన చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను తొలగించేందుకు నూతన కార్యవర్గం శ్రీకారం చుట్టింది. మల్లేశ్వరం మార్కెట్ యార్డు చైర్మన్ ఒడుగు తులసీ రావు, సెక్రటరీ బి.వి. రామకృష్ణ గురువారం పనులు ప్రారంభించారు. వైస్ చైర్మన్ భూపతి రమేష్, డైరెక్టర్లు బండ్రెడ్డి నాగరామాంజనేయులు, వక్కలగడ్డ కరుణకుమార్, మహ్మద్ అక్బర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొండ, దాసరి ఏడుకొండలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



జలధీశ్వరస్వామి ఆలయంలో అష్టాదశ శక్తి పీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల వేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ద్వాదశ జ్యోతిర్లింగం, శక్తి పీఠాల వేదిక ప్రారంభం

ఘంటసాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల బాలపార్వతీ సమేత జలధీశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అష్టాదశ శక్తి పీఠాలు, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల వేదికను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం ప్రారంభించారు. చావలి దుర్గా ప్రసాద్ దీక్షితుల ఆధ్వర్యంలో రుత్వికులు చావలి కృష్ణ కిషోర్ శర్మ, దాలిపర్తి చలపతిరావు దాతలు పాలడుగు శివశంకర్‌రావు - ఈశ్వరమ్మ, దావులూరి ప్రకాశరావు - శ్రీరావమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సత్కరించి జ్ఞాపికను అందజేశారు. స్కంద పురాణంలో జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాల విశిష్టతను అనుసరించి చేయడం జరిగిందని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ వివరించారు.



పీఏసీఎస్ చైర్మన్ కాగిత నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే కాగిత

దావోజీపాలెం పీఏసీఎస్ కార్యవర్గానికి సత్కారం

పెడన రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంలో రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించటమే ప్రభుత్వ ఉద్దేశ్యమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. దావోజీపాలెం వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అధ్యక్షుడు కాగిత నాగేశ్వరరావు, సభ్యులను సత్కరించారు. ప్రస్తుతం రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పంట దిగుబడి సమయంలో ధాన్యం అమ్ముకునేందుకు రైతులకు ఏవిధమైన ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు.. సంఘ పాలక వర్గాలు రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్ పామర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధ్యాపకురాలు ఉమాసరస్వతి ఔదార్యం

చల్లపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పాఠాలు బోధించటమే కాకుండా వారికి ఇతోధిక ంగా సహాయ సహకారాలు అందించి ప్రోత్సహిస్తున్నారు పురిటిగడ్డ జడ్పీహైస్కూల్ ప్లస్ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఓలేటి ఉమాసరస్వతి. ఇంటర్ చదువుతున్న 12 మంది విద్యార్థులకు గురువారం రూ.10 వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.సురేష్ చేతుల మీదుగా అందజేశారు. ఎకో క్లబ్ కార్యక్రమాల్లో చురుకుగా ఉండే విద్యార్థులకు క్రీడాసామాగ్రిని బహుమతిగా అందించారు. విద్యార్థులకు చేయూత అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్న తెలుగు అధ్యాపకురాలు ఉమాసరస్వతిని హెచ్‌ఎం, అధ్యాపక బృందం అభినందించారు. ఈ సేవా కార్యక్రమంతోపాటు డ్రాపవుట్స్‌గా ఉన్న శ్రీకాకుళానికి చెందిన ముగ్గురు విద్యార్థినిలను డాక్టర్ ఉమాసరస్వతి పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ బైపీసీలో చేర్చారు.



విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం సురేష్, టీచర్ ఉమాసరస్వతి

రేషన్ బియ్యం పట్టివేత

అవనిగడ్డ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అవనిగడ నుంచి అక్రమంగా తరలిస్తున్న 1500 కిలోల రేషన్ బియ్యాన్ని ఎస్సై శ్రీనివాస్ గురువారం తెల్లవారుజామున పట్టుకుని నలుగురిని అరెస్టు చేశారు. పెదకళ్లేపల్లి గ్రామానికి చెందిన పడమటి సాయి కిరణ్ ఏపి19 విసి 3476 వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, సీఐ యువకుమార్ ఆదేశాల మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని, సాయికిరణ్‌తోపాటు ముగ్గురు కూలీలను అరెస్టు చేశామన్నారు. రేషన్ బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు.

దమ్ము ట్రాక్టర్ల వీల్స్‌కు ఇనుప పట్టాలు లేకుండా నడిపితే చర్యలు

కోడూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : దమ్ము ట్రాక్టర్ల వీల్స్‌కు ఇనుప పట్టాలు లేకుండా రోడ్డు మీద నడపరాదని కోడూరు ఎస్సై చాణిక్య అన్నారు. వి.కొత్తపాలెం గ్రామం వద్ద రైతులకు, ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించారు. కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారితోపాటు పలు రహదారుల మీద దమ్ము ట్రాక్టర్లు పట్టాలు లేకుండా తిరగటం వల్ల రహదారులు పాడైపోతున్నాయన్నారు. రైతులు, ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జయపురం, వి.కొత్తపాలెం, కృష్ణాపురం గ్రామాల మధ్య ప్రతి రోజు పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. ట్రైనీ ఎస్సై సిహెచ్.దివ్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌కార్డుల మంజూరుకు ఎస్టీలకు ప్రత్యేక కేంద్రం

మచిలీపట్నం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీలకు త్వరలో ఆధార్‌కార్డుల మంజూరుకు ప్రత్యేక కేంద్రం ప్రారంభిస్తామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం ఫణిదూర్జటి అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు వెంకటేశ్వరరావు మనుమరాలు హేమాంష్ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం. ఫణి దూర్జటి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్టీలకు ఆధార్‌కార్డులు లేక పోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జి.కిషోర్‌కుమార్, కార్యదర్శి హసీంబేగ్‌లు తెలిపారు. నారాయణపురం, రైలుపేట ఎస్టీ కాలనీవిద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. డీటీ సత్యనారాయణ నారాయణపురం ఎస్టీ విద్యార్థులకు స్టీల్‌ప్లేట్లు, వాటర్ క్యాన్లు అందజేశారు. సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, అవనిగడ్డ ఫైర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుధాకర్ ఇద్దరు ఎస్టీ విద్యార్థులకు చదువుకునేందుకు సహాయం అందిస్తున్నారన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జాయింట్ సెక్రటరీ పివి ఫణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వడ్డి చిరంజీవి కుమార్, కుంభ రవికిరణ్, సురేష్‌బాబు, వెంకటేశ్వరరావు మాట్లాడారు. మానవతావాది అశోక్‌కుమార్ అతిథులకు మొక్కలు పంపిణీ చేశారు. పాఠశాలలో మొక్కలు నాటారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సలహాదారుడు లంకిశెట్టి బాలాజీ సత్కరించారు.

వరద..అధికారుల అప్రమత్తం

నాగాయలంక, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక రేవుకు గురువారం సాయంత్రం భారీగా వరద నీరు చేరింది. శ్రీరామపాదక్షేత్రం పుష్కరఘాట్‌లోని మెట్లను దాటుతూ పరవళ్లు తొక్కుతోంది. వరద ప్రవాహాన్ని అధికారులు పరిశీలించారు.

నదిలోకి వరద నీరు ఉధృతంగా వస్తుండటంతో మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చి లంగర్లు వేశారు. అధికారులు అప్రమత్తమై క్షేత్రస్థాయిలో పర్యటించారు.

మత్స్యశాఖ జేడీ, మండల ప్రత్యేకాధికారి కె.నాగరాజు, తహసీల్దార్ సిహెచ్.వీరాంజనేయ ప్రసాద్, ఇరిగేషన్ ఏఈ పి.రవితేజ టి.కొత్తపాలెం, ఏటిమొగ గ్రామాల్లో బలహీనంగా ఉన్న కరకట్టల ప్రదేశాలను పరిశీలించారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మత్స్యశాఖ సిబ్బంది, వీఆర్వో టిజివి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



టి.కొత్తపాలెం వద్ద కరకట్టను పరిశీలిస్తున్న అధికారులు



పాత ఎడ్లంకలో వరదను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

టీడీపీ నేతల పరిశీలన

అవనిగడ్డ : టీడీపీ సీనియర్ నేత బొబ్బా గోవర్థన్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఎడ్లంక దీవిని సందర్శించి గ్రామం కోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఎడ్లంక గ్రామస్థులు కొద్దిపాటి వరదకు కూడా బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఇప్పటికే అధ్యయనం చేసిందని, త్వరలో శాశ్వత పరిష్కారం లభిస్తుందని భరోసా ఇచ్చారు. మాజీ సర్పంచ్ పీతా వెంకటేశ్వరరావు, పరుచూరి దుర్గా ప్రసాద్, బండే రాఘవ, కనగాల సత్యంబాబు, కొల్లూరి వాసు, మేడికొండ విజయ్, కొల్లూరి ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ వనజాక్షి, సీసీ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ



పదవీ విరమణ చేస్తున్న ఎస్సైలు, ఏఎస్సైల దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ గంగాధరరావు

సేవకులకు సత్కారం

చల్లపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి గురువారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ చేతులమీదుగా సన్మానం అందుకున్నారు. మచిలీపట్నం జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా రెడ్‌క్రాస్ వార్షిక సాధారణ సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీకి నిధుల సేకరణలో సహకారం అందించినందుకు తహసీల్దార్‌ను సన్మానించి జ్ఞాపికను అందించారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్రరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టిఎస్ఎస్.బాలాజీ, భవిరి శంకర నాథ్ ఉన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖకు నిధుల సేకరణలో విశేష సహకారం అందించిన చల్లపల్లికి చెందిన డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావును ఇన్‌చార్జి కలెక్టర్, డీఆర్వో, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

పదవీ విరమణ ఎస్సైలకు ఎస్పీ సత్కారం

మచిలీపట్నం క్రైమ్ : పోలీసు శాఖలో అత్యున్నత సేవలందించి సంపూర్ణ ఆరోగ్యంతో పదవీ విరమణ చేయడం అదృష్టమని ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. పదవీ విరమణ చేస్తున్న ఎస్సైలు బలరాం, యు.ఎల్ సుబ్రహ్మణ్యం, ఎస్.వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ మహ్మమద్ ముస్తఫా దంపతులను ఆయన ఘనంగా సత్కరించారు. కుటుంబంతో కంటే పోలీస్ శాఖలో ఎక్కువ సమయం గడిపారని, ప్రజాక్షేమం కోసం కృషి చేసి, గౌరవ ప్రదంగా, మర్యాదపూర్వకంగా పదవీ విరమణ చేయడం అదృష్టమన్నారు. పదవీ విరమణ చేస్తున్న సిబ్బంది కుటుంబాల వివరాలను, పిల్లల చదువులు, ఉద్యోగ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అడిషనల్ ఎస్పీ వి.వి నాయుడు, బందరు డీఎస్పీ సిహెచ్ రాజా, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్సై వెంకటేశ్వరరావుకు..

ట్రాఫిక్ ఎస్సైగా పదవీ విరమణ చేసిన ఎస్. వెంకటేశ్వరరావును గురువారం పలువురు సత్కరించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, 82 క్యాష్ రివార్డులు, 40 ప్రత్యేక అవార్డులు పొందినట్టు తెలిపారు. టీడీపీ నాయకుడు పి.వి. ఫణికుమార్ తదితరుల పాల్గొన్నారు.





వృత్తికి వన్నె తెచ్చిన సుధాకర్‌రావు : జవహర్

ఘంటసాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి నలుకుర్తి సుధాకర్ రావు అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ పేర్కొన్నారు. గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేస్తున్న నలుకుర్తి సుధాకర్‌రావు అభినందన సభ పాఠశాల ప్రాంగణంలో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జవహర్ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత సుధాకర్‌రావుకు దక్కుతుందన్నారు. సుధాకర్‌రావును పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పరుచూరి సుభాష్ చంద్రబోస్, మాచవరపు ఆదినారాయణ, గోపిచంద్, కుంపటి సుబ్బారావు, ఎంఈవోలు శివశంకర్‌రావు, మోమిన్, విశ్రాంత ఎంఈవో వేమూరి మురళీకృష్ణ, హెచ్‌ఎం కృష్ణకుమారి, ఉపాధ్యాయులు కైతేపల్లి దాస్, దేవరపల్లి సురేష్, బసవేశ్వరరావు, భార్గవ, పిచ్చేశ్వరరావు, ముమ్మనేని శ్రీను పాల్గొన్నారు.

ముమ్మరంగా సుపరిపాలనలో తొలి అడుగు

పెడన, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం కూటమి ప్రభుత్వ జవాబుదారీతనానికి నిదర్శనమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్ బాషాతో కలిసి ఐదో వార్డులో పర్యటించారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. హజ్ కమిటీ హాజీ హసన్ బాషా మాట్లాడుతూ, ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. కొనకళ్ళ బుల్లయ్య, యక్కల శ్యామలయ్య, పూలబాబు, హన్ను, వహబ్‌ఖాన్, గుజరాల్, గఫార్, కమ్మగంటి బాబు, వీణం శ్రీనివాస్, జనసేన పార్టీ నాయకులు మట్టా శివపావని, నాని తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి : చల్లపల్లిలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం చురుకుగా సాగుతోంది. గురువారం 62వ బూత్ పరిధిలో టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, ఎంపీటీసీ సభ్యుడు పైడిపాముల స్వప్న, క్లస్టర్ ఇన్‌చార్జి మోర్ల శివ, నేతలు షేక్ నబీమోరి, కోట సత్యనారాయణ, వేముల హరికృష్ణ, వేము ల అర్జునరావు, బి.కనకదుర్గ, జన్ను నాంచారయ్య, పఠాన్ జిలానీ, దిల్‌షాద్ నజరానా పాల్గొన్నారు.

నాగాయలంక : రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే సత్తా ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకే ఉందని బీసీ నేత, టీడీపీ జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని కమ్మనమోలు, మర్రిపాలెం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. ఉప్పల ప్రసాద్, తాడేపల్లి వెంకట పాపారావు, కోలా వెంకటేశ్వరరావు, సనకా సురేష్ బాబు, మద్ది వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, బండ్రెడ్డి శ్రీనివాసరావు, బొమ్మిడి ప్రసాదరావు, ఈవూరి నాగార్జున, చింతా శంకరరావు, నాగులుపాటి పాండు, చిరివేళ్ల నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

మోపిదేవి : రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే సత్తా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే ఉందని టీడీపీ నాయకులు అన్నారు. ప్రజాశక్తి నగర్‌లో మండల పార్టీ అధ్యక్షుడు నడకుదుటి జనార్దన రావు ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ నేతలు రావి రత్నగిరిరావు, చందన రంగారావు, కొలుసు శివ రాజేష్, బల్లా సీతారాం ప్రసాద్, యక్కటి హనుమాన్ ప్రసాద్, పుప్పల యేసు తదితరులు ఉన్నారు.

అవనిగడ్డ : గ్రామాల ప్రగతి, రాష్ట్ర సమగ్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. అవనిగడ్డ లంకమ్మ అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో టీడీపీ నేతలు గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాలు వివరించి కూటమి ప్రభుత్వం చేపట్టిన రహదారుల అభివృద్ధి, ఉపాధి కల్పనను వివరించారు. కర్రా సుధాకర్, పరుచూరి దుర్గా ప్రసాద్, బండే రాఘవ, మండలి రామ్మోహనరావు, ఘంటసాల రాజమోహనరావు, అడపా శ్రీను, షేక్ బాబావలి, కొల్లూరి ఇమ్మానియేలు, చెన్నగిరి అయ్యప్ప, కమ్మిలి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మచిలీపట్నం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో 21ను సవరించాలని సీఐటీయూ నాయకుడు బి. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మంగినపూడి సెంటర్‌లో వాకాలమ్మ తల్లి ఆటో వర్కర్స్ యూనియన్ ఏర్పాటు కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం మాట్లాడారు. నాయకులు రామిశెట్టి బోసు, వాలిశెట్టి రవిశంకర్, కాగిత నాగరాజు, సిహెచ్. జయరావు, సిరివెళ్ళ వెంకట వరప్రసాద్, వాలిశెట్టి యుగంధర్, అడ్డాల రామకృష్ణ పాల్గొన్నారు.

దస్తగిరి జెండా నిర్మాణానికి హసీంబేగ్ రూ. లక్ష విరాళం

మచిలీపట్నం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 15వ డివిజన్‌లో గౌసే ఆజం దస్తగిరి జెండా పునర్నిర్మాణానికి రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు డాక్టర్ హసీంబేగ్ రూ.లక్ష విరాళం అందజేశారు. జెండా పునర్నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. జెండా కమిటీ అధ్యక్షుడు ఎండి అమీన్, బొర్రా రంగా, ఎండి ముస్తాఖ్, చోటే, ముదినేని సాయికృష్ణ పాల్గొన్నారు.



హర్షిత్ సాయికి బంగారు పతకాలు

మచిలీపట్నం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మచిలీపట్నం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి కొల్లా హర్షిత్ సాయి రెండు విభాగాల్లో ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకాలు సాధించాడు. కళాశాలలో విజేత హర్షిత్‌ను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్. శేషారెడ్డి, డైరెక్టర్ సుగుణరెడ్డి, ప్రిన్సిపాల్ వి. నరసింహారావు, రీజనల్ మేనేజర్ సురేందర్‌రెడ్డి, బాపూజీ అభినందించారు.

67 మందికి సీఎంఆర్‌ఎఫ్ సాయం

అవనిగడ్డ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని 67 మంది లబ్ధిదారులకు రూ.48.55 లక్షల సీఎంఆర్‌ఎఫ్ పత్రాలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం అందజేశారు. లబ్ధిదారులతోపాటు టీడీపీ నేత రావి నాగేశ్వరరావు, జనసేన నేత అన్నపరెడ్డి వెంకటస్వామి పాల్గొన్నారు.

మంచినీటి పథకం పరిశీలన

అవనిగడ్డ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ పంచాయతీ పరిధిలో దాదాపు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బిహెచ్‌డి.ప్రసన్న, ఏఈ భోగాది జగత్ గురువారం పరిశీలించారు. ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని విజయ్ కుమార్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పుష్కలంగా ఎరువులు

మచిలీపట్నం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల కొరత ఉం దంటూ వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పుష్కలంగా ఎరువులు ఉన్నాయన్నారు. నాయకులు మీనవల్లి నాగేశ్వరరావు, రాంబాబు, అన్నెంరెడ్డి శ్రీనివాసరావు, డి.నాగరాజు, అమ్మిరెడ్డి శివ, సుబ్బారెడ్డి, రవి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

పెడన రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చే యాలని హౌసింగ్ కార్పోరేషన్ పీడీ పోతురాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పట్టణ, మండల పరిధిలో ఇళ్ల నిర్మాణాలు ఏఏ దశలలో ఉన్నాయో తెలుసుకునేందుకు ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. అగస్టు 25 నాటికి గృహప్రవేశాలు అయ్యేలా చూడాలన్నారు. ఆర్థిక ఇబ్బందులతో లబ్దిదారులు ముందుకు రావటం లేదని ప్రభుత్వం గుర్తించి, ఎస్సీ ఎస్టీ, బీసీలకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించిందన్నారు. 22-23 ఆర్థిక సంవత్సరం ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తవ్వాలని, లేదంటే రెవున్యూ రికవరీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఈఈ ఎస్. వెంకట్రావు, డీఈ బుజ్జిబాబు, ఎంపీడీవో శివ ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి

పెడన రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపర్చాలని ఎంపీడీవో కె. శివప్రసాద్ అన్నారు. జింజేరు గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. తాగునీరు సరఫరా ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో చెత్త వేయరాదన్నారు. వర్షాకాలం అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాల చిన్నారులకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. సంపద తయారీ కేంద్రంలో వానపాముల పెంపకం సంతృప్తిగా ఉందన్నారు. కార్యదర్శి బాలాజి పాల్గొన్నారు.

వీఆర్‌ఏ చెంచులు మృతి

పెడన రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నందిగామ వీఆర్‌ఏ బొడ్డు చెంచులు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఆర్‌ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు, వీఆర్‌ఏలు సంతాపం తెలిపారు. నందిగం సొసైటి అధ్యక్షుడు యారగాని నాగరాజు రూ.10 వేలు, దావోజిపాలెం సొసైటీ అధ్యక్షుడు కాగిత నాగేశ్వరరావు రూ.5 వేలు చెంచులు కుటుంబానికి అందజేశారు.

88 మందికి వితంతు పింఛన్లు

అవనిగడ్డ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భర్తలను కోల్పోయిన వితంతువులకు నూతనంగా 88 పింఛన్లు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో వనజ తెలిపారు.